

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 02 | సంచిక: 337 | హైదరాబాద్ | శుక్రవారం | 15-05-2026 | పేజీలు: 08


# నీట్ పేపర్ లీక్‌పై పారదర్శక విచారణ జరపాలి

**నీట్ పరీక్ష రద్దు అంశంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన**
**పేపర్ లీక్ ఘటనపై సమగ్ర, పారదర్శక విచారణకు డిమాండ్**
**లక్షలాది విద్యార్థుల్లో ఆందోళన నెలకొందని ఆవేదన**
**దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది విద్యార్థులపై ప్రభావం**
**పరీక్షల విశ్వసనీయతను కాపాడాలని కేంద్రానికి సూచన**
**పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు అవసరమని వ్యాఖ్య**
**విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**
**పోటీ పరీక్షలు అవకాశాల వేదికగా ఉండాలని సూచన**
**బీజేపీ, బీఆర్ఎస్‌లపై సీఎం తీవ్ర విమర్శలు**
**పరీక్షల నిర్వహణలో వైఫల్యాలపై రాజకీయ విమర్శలు గుప్పించిన సీఎం**




**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. పేపర్ లీక్ ఘటనపై సమగ్రంగా, పారదర్శకంగా విచారణ జరపాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటన వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ పరిణామంతో దేశవ్యాప్తంగా సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని సీఎం పేర్కొన్నారు. విద్యార్థుల శ్రమ, కృషి వృథా కాకుండా ఉండాలంటే పరీక్షల నిర్వహణలో విశ్వసనీయత అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరఫున కేంద్రానికి పలు సూచనలు చేసినట్లు సీఎం తెలిపారు. పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను మరింత పెంచాలని, పేపర్ లీక్ ఘటనలకు అడ్డుకట్ట వేసేలా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పేపర్ లీక్ మాఫియాపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థులు మళ్లీ ఇలాంటి పరిస్థితుల వల్ల ఇబ్బంది పడకుండా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు

..మిగతా 2లో

# ఆస్ట్రేలియా హైకమిషనర్‌తో కేటీఆర్ కీలక భేటీ

పెట్టుబడులు, ఐటీ సహకారంపై విస్తృత చర్చ
కేటీఆర్ నివాసంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశం
ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ పాల్గొన్న భేటీ
కర్ణాటక, తెలంగాణ కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ హాజరు
పరస్పర పెట్టుబడుల అవకాశాలపై విస్తృత చర్చ
ఐటీ రంగంలో సహకారంపై ప్రత్యేక దృష్టి
హైదరాబాద్ టెక్ ఎకోసిస్టమ్‌పై కేటీఆర్ వివరణ
గ్రీన్ ఎనర్జీ, ఫార్మా రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు
విద్యా రంగంలో కొత్త ఒప్పందాలపై చర్చ
యువతకు అంతర్జాతీయ అవకాశాలపై అభిప్రాయాలు
భారత్-ఆస్ట్రేలియా సంబంధాల బలోపేతంపై ఆశాభావం



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

కల్వకుంట్ల తారక రామారావుతో ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ భేటీ అయ్యారు. నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో జరిగిన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో ఇరుపక్షాల మధ్య పరస్పర సహకారం, పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చ జరిగింది.

ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్‌తో పాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ కూడా సమావేశంలో పాల్గొన్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా

..మిగతా 2లో

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం



**యాసంగి సీజన్‌లో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం**
**రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా**
**కూసుమంచి మండలం పాలేరులో కొనుగోలు కేంద్రం పరిశీలన**
**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి అధికారుల సమీక్ష**
**ట్రాన్స్‌పోర్ట్, హమాలీల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం**
**రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం రవాణా వ్యవస్థ బలోపేతానికి చర్యలు**
**బిహార్, పశ్చిమ బెంగాల్ నుంచి హమాలీలు రానందున కొరత**
**కలెక్టర్లకు లారీలు, డీసీఎంలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు**
**కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు సూచనలు**
**రైతుల నుంచి ధాన్యం సేకరణలో ఎలాంటి జాప్యం ఉండదని స్పష్టం**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. వరి రైతులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. ప్రభుత్వ కొనుగోలు విధానం పట్ల పూర్తి విశ్వాసంతో ఉండాలని రైతులకు

..మిగతా 2లో

# పంటల కొనుగోళ్లలో ప్రభుత్వం ఫెయిల్

**ఆందోళనల్లో అన్నదాతలు**
**బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**
**వరి, మొక్కజొన్న, జొన్న కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ**
**రైతులు రోజువారీగా ఆందోళనలకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్య**
**ఇప్పటివరకు 40 శాతం కూడా కొనుగోళ్లు జరగలేదని ప్రశ్న**
**నిర్మల్ జిల్లాలో రైతు ధర్నాలో పాల్గొన్న బీజేపీ నేత**
**అకాల వర్షా లతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన**
**కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బందుల్లోకి నెట్టబడ్డారని ఆరోపణ**
**గన్నీ సంచుల సరఫరా కూడా సరిగా లేకపోవడం విమర్శకు కారణం**
**తడిసిన ధాన్యాన్ని పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్**
**తేమ, తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆరోపణ**
**రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచన**



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

వరి, మొక్కజొన్న, జొన్న పంటల కొనుగోళ్లలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ శాసనసభపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. పంటల కొనుగోలు ప్రక్రియ సకాలంలో జరగకపోవడంతో రైతులు ప్రతిరోజూ ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు.గురువారం నిర్మల్ జిల్లాలో జరిగిన రైతు ధర్నాలో

..మిగతా 2లో



# ఓటరు జాబితా ప్రక్షాళనకు రంగం సిద్ధం

**మే 30 నుంచి మూడో దశ సర్ ప్రక్రియ**
**ఏపీ, తెలంగాణ షెడ్యూల్ ఖరారు**
**16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రారంభం**
**36.73 కోట్ల మంది ఓటర్ల డేటా పరిశీలన ప్రక్రియలో 3.94 లక్షల మంది అధికారులు**
**ఏపీలో జూన్ 15 నుంచి ఇంటింటి సర్వే**
**సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా విడుదల**
**తెలంగాణలో జూన్ 25 నుంచి షురూ**
**అక్టోబర్ 1వ తేదీన ఓటర్ల ఫైనల్ లిస్ట్ ప్రకటన**
**పారదర్శకత కోసం బూత్ లెవల్ ఏజెంట్ల నియామకానికి ఈసీ ఆదేశం**
**జమ్ముకశ్మీర్, హిమాచల్, లద్ధాఖ్‌లలో వాయిదా పడ్డ షెడ్యూల్**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా మూడో దశకు సంబంధించిన కీలక షెడ్యూల్‌ను విడుదల చేసింది. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటరు జాబితాను సర్వసమగ్రంగా, తప్పులు లేకుండా రూపొందించడమే లక్ష్యంగా మే 30వ తేదీ నుంచి ఈ ప్రక్రియను దశలవారీగా చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఈ మూడో దశలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు ఢిల్లీ, కర్ణాటక, మహారాష్ట్ర వంటి మొత్తం 16 రాష్ట్రాలు మరియు మూడు కేంద్ర పాలిత ప్రాంతాలు ఉన్నాయి. ఓటర్ల వివరాల నమోదులో పారదర్శకతను పెంచేందుకు, అనర్హుల తొలగింపునకు

..మిగతా 2లో

# గవర్నర్ వాహనాల కుదింపు

ఇంధన పొదుపు దిశగా నిర్ణయం
ప్రధాని మోదీ పిలుపును ఆచరిస్తున్న తెలంగాణ గవర్నర్
తన కాన్వాయ్‌లో వాహనాల సంఖ్య తగ్గించాలన్న నిర్ణయం
లోక్ భవన్‌లో ఇప్పటికే సగం వాహనాలు తగ్గించినట్లు వెల్లడి
ఇంధన పొదుపు చర్యలకు పూర్తిగా మద్దతు ప్రకటించిన గవర్నర్
ఖర్చుల నియంత్రణకు ఈ చర్యలు ఉపయోగపడతాయని వ్యాఖ్య
సీఎం, మంత్రులు, అధికారులు కూడా పాటించాలని సూచన
ప్రజలు కూడా ప్రధాని విజ్ఞప్తిని అనుసరించాలని పిలుపు
పాఠశాలలు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాల సూచన
ఇంధన వినియోగాన్ని తగ్గించడమే లక్ష్యమని స్పష్టం



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దేశంలో ఇంధన పొదుపు చర్యలు పాటించాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపును తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ఆచరిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన తన అధికారిక కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను తగ్గించాలని

..మిగతా 2లో

# బండి భగీరథ్ కేసులో బాధితురాలు మైనర్ కాదు

**రెండు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు ఉన్నాయన్న న్యాయవాది**
**హైకోర్టులో ఉత్కంఠభరిత వాదనలు**
**భగీరథ్ తరఫున వాదించిన నిరంజన్ రెడ్డి**
**పోక్సో చట్టం వర్తించదంటూ కోర్టుకు వివరణ**
**సీల్డ్ కవర్‌లో ఆధారాలు సమర్పిస్తామని ప్రకటన**
**మీడియా ట్రయల్స్ జరుగుతున్నాయంటూ ఆరోపణలు**
**వాల్ పోస్టర్లు, సోషల్ మీడియాలో దుష్ప్రచారం అన్న వాదన**
**మధ్యంతర రక్షణ కల్పించాలని కోర్టును కోరిన భగీరథ్ తరఫు**
**మధ్యంతర రక్షణపై రేపటికి ఉత్తర్వులు**
**ముందస్తు బెయిల్ విచారణ వచ్చే వారానికి వాయిదా**



# నీట్ పేపర్ లీక్‌పై పారదర్శక విచారణ జరపాలి

మొదటిపేజీ తరువాయి

చేయాలని ఆయన సూచించారు. పోటీ పరీక్షలు విద్యార్థులకు అవకాశాల వేదికగా ఉండాలని, కానీ వారి జీవితాలను నాశనం చేసే పరిస్థితి రాకూడదని సీఎం అన్నారు. పరీక్షల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం నిలబెట్టడం ప్రభుత్వాల బాధ్యత అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో, రాష్ట్రంలో పరీక్షల నిర్వహణలో జరుగుతున్న వైఫల్యాలు, పేపర్ లీక్ ఘటనలపై రెండు పార్టీల వైఖరిని ఆయన ప్రశ్నించారు. ఈ రెండు పార్టీల మధ్య ఈ విషయంలో పెద్ద తేడా లేదంటూ విమర్శలు గుప్పించారు. మొత్తంగా నీట్ యూజీ వివాదం నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఆస్ట్రేలియా హైకమిషనర్‌తో కేటీఆర్ కీలక భేటీ

మొదటిపేజీ తరువాయి

దృష్టి సారించారు.
తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ముఖ్యంగా ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఇన్నోవేషన్ రంగాల్లో సహకారంపై ఇరు పక్షాలు చర్చించాయి. హైదరాబాద్ కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ఎకో సిస్టమ్‌పై హైకమిషనర్ బృందానికి కేటీఆర్ వివరించారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవాన్ని ప్రస్తావిస్తూ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ తీసుకుంటున్న చర్యలను కేటీఆర్ వివరించినట్లు సమాచారం. విద్యారంగంలో కొత్త భాగస్వామ్యాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై కూడా చర్చ జరిగింది. భారత్-ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలపై ఇరుపక్షాలు అభిప్రాయాలు పంచుకున్నాయి. యువతకు అంతర్జాతీయ అవకాశాలు కల్పించే దిశగా ఈ భాగస్వామ్యం కీలకంగా మారుతుందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ భేటీ ద్వారా భవిష్యత్తులో తెలంగాణ-ఆస్ట్రేలియా మధ్య ఆర్థిక, సాంకేతిక, విద్యా రంగాల్లో సహకారం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తమైంది. సమావేశం అనంతరం కేటీఆర్ ఈ చర్చలపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.



# పంటల కొనుగోళ్లలో ప్రభుత్వం ఫెయిల్

మొదటిపేజీ తరువాయి

పాల్గొన్న ఆయన, రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటివరకు కనీసం 40 శాతం కూడా పంటల కొనుగోళ్లు జరగలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రకటించిన హామీలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని అన్నారు.
అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్న మాటలకు, వాస్తవ పరిస్థితికి పొంతన లేదని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రైతులు ఆత్మహత్యల వరకు వెళ్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతు కొనుగోళ్ల వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, గన్నీ సంచులు కూడా సరఫరా చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాల లోపం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తేమ, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని రక్షించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ, వెంటనే సమగ్ర కొనుగోలు వ్యవస్థను ఏర్పాటు చేయాలని బీజేపీ నేత డిమాండ్ చేశారు.



# బండి భగీరథ్ కేసులో బాధితురాలు మైనర్ కాదు

- **రెండు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు ఉన్నాయన్న న్యాయవాది**
- **హైకోర్టులో ఉత్కంఠభరిత వాదనలు**
- **భగీరథ్ తరపున వాదించిన నిరంజన్ రెడ్డి**
- **పోక్సో చట్టం వర్తించదంటూ కోర్టుకు వివరణ**
- **సీల్డ్ కవర్‌లో ఆధారాలు సమర్పిస్తామని ప్రకటన**
- **మీడియా ట్రయల్స్ జరుగుతున్నాయంటూ ఆరోపణలు**
- **వాల్ పోస్టర్లు, సోషల్ మీడియాలో దుష్ప్రచారం అన్న వాదన**
- **మధ్యంతర రక్షణ కల్పించాలని కోర్టును కోరిన భగీరథ్ తరపు**
- **మధ్యంతర రక్షణపై రేపటికి ఉత్తర్వులు**
- **ముందస్తు బెయిల్ విచారణ వచ్చే వారానికి వాయిదా**

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్కు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టులో గురువారం వాడివేడి వాదనలు జరిగాయి. భగీరథ్ తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి కీలక వాదనలు వినిపించారు. ఈ కేసులో బాధితురాలు అసలు మైనర్ కాదని, అందువల్ల పోక్సో చట్టం వర్తించదని కోర్టుకు తెలిపారు. గతంలో బాధితురాలిపై నమోదైన మరో కేసులో పోలీసులు కోర్టుకు సమర్పించిన ఛార్జ్‌షీట్‌లో ఆమెను మేజర్‌గా పేర్కొన్నారని వాదించారు.
బాధితురాలికి సంబంధించి రెండు వేర్వేరు జనన తేదీ ధ్రువపత్రాలు ఉన్నాయని, వాటిలో పుట్టిన తేదీలు భిన్నంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసులో మరో తేదీని ప్రస్తావిస్తున్నారని, అసలు ఏ తేదీ సరైందో కోర్టే నిర్ణయించాల్సి ఉంటుందని తెలిపారు. భగీరథ్ నిర్దోషి అని నిరూపించే పలు ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, వాటిని సీల్డ్ కవర్‌లో సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని కోర్టుకు వెల్లడించారు. ఈ ఆధారాలను సమర్పించే అవకాశం ఇవ్వాలని కోరారు.
భగీరథ్ ఎలాంటి ప్రత్యేక హక్కులు కోరడం లేదని, అయితే ఈ కేసును సాధారణ కేసుల మాదిరిగా చూడకూడదని నిరంజన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. భగీరథ్ తండ్రి కేంద్ర మంత్రిగా ఉండటంతో రాజకీయ, సామాజిక ఒత్తిడులు తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వాల్ పోస్టర్లు, మెట్రో రైళ్లలో ప్రచారాలు చేస్తూ భగీరథ్‌ను దోషిగా చిత్రీకరిస్తున్నారని, సోషల్ మీడియా ద్వారా కూడా దుష్ప్రచారం సాగుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేయకముందే మీడియా ట్రయల్స్ ద్వారా నిందితుడిని శిక్షించే ప్రయత్నం జరుగుతోందని వాదించారు. భగీరథ్‌కు మధ్యంతర రక్షణ కల్పిస్తే విచారణకు పూర్తిగా సహకరిస్తారని, తమ వద్ద ఉన్న సాక్ష్యాలను పోలీసుల ముందుంచేందుకు అవకాశం కల్పించాలని కోర్టును కోరారు. మధ్యంతర రక్షణ లేకపోతే ముందస్తు బెయిల్ పిటిషన్ ప్రయోజనం లేకుండా పోతుందని, తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే అవకాశాన్ని కోల్పోతారని తెలిపారు. వాదనలు విన్న హైకోర్టు భగీరథ్‌కు మధ్యంతర రక్షణ కల్పించే అంశంపై ఉత్తర్వులను శుక్రవారానికి వాయిదా వేసింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

# ఓటరు జాబితా ప్రక్షాళనకు రంగం సిద్ధం

మొదటిపేజీ తరువాయి

ఈ సవరణ ప్రక్రియ దోహదపడనుంది. అయితే, మంచు కురిసే హిమాలయ ప్రాంతాలైన హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్ మరియు లద్ధాఖ్‌లలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, అక్కడ మాత్రం షెడ్యూల్‌ను తర్వాత వెల్లడిస్తామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.
ఈ మూడో దశ సవరణ ప్రక్రియలో దాదాపు 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా సుమారు 3.94 లక్షల మంది బూత్ స్థాయి అధికారులు రంగంలోకి దిగనున్నారు. వీరు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల పేర్లు, చిరునామాలు, వయస్సు వంటి వివరాలను స్వయంగా తనిఖీ చేస్తారు. ఈ ప్రక్రియలో అధికారులు ఎటువంటి పక్షపాతం లేకుండా పని చేసేలా చూసేందుకు రాజకీయ పార్టీల సహకారాన్ని కూడా ఈసీ కోరింది. రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల మంది బూత్ లెవల్ ఏజెంట్లు ఈ తనిఖీల్లో అధికారులకు తోడుగా ఉండి, జాబితాలో ఉండాల్సిన అసలైన ఓటర్ల వివరాలను ధ్రువీకరిస్తారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద తప్పనిసరిగా ఏజెంట్లను ఉంచాలని, తద్వారా జాబితా రూపకల్పనలో రాజకీయ పక్షాల అభ్యంతరాలకు ఆస్కారం లేకుండా చూడాలని ఎన్నికల సంఘం పార్టీలకు దిశానిర్దేశం చేసింది.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విషయానికొస్తే, ఇక్కడ జూన్ 15వ తేదీ నుంచి జులై 14వ తేదీ వరకు నెల రోజుల పాటు బీఎల్ఓలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారు. ఈ తనిఖీలు పూర్తయిన తర్వాత జులై 21న ముసాయిదా జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై ఎవరికైనా ఫిర్యాదులున్నా, కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలన్నా లేదా తప్పులను సరిదిద్దుకోవాలన్నా ఆగస్టు 20 వరకు గడువు ఉంటుంది. వచ్చిన అభ్యంతరాలన్నింటినీ పరిష్కరించి, సెప్టెంబర్ 22వ తేదీన ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి పక్కాగా ఉన్న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తారు. అలాగే అరుణాచల్ ప్రదేశ్, హరియాణా రాష్ట్రాల్లో కూడా ఇదే షెడ్యూల్ అమలు కానుంది.
తెలంగాణలో ఓటర్ల వివరాల పరిశీలన ప్రక్రియ జూన్ 25న ప్రారంభమై జులై 24 వరకు కొనసాగుతుంది. ఒక నెల రోజుల పాటు సాగే ఈ ఇంటింటి సర్వే అనంతరం, జులై 31న ముసాయిదా జాబితాను బహిర్గతం చేస్తారు. అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ ఓటర్ల తుది జాబితాను ప్రకటించనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. పంజాబ్ రాష్ట్రంలోనూ ఇదే కాలక్రమం అనుసరిస్తారు. కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ వంటి ఇతర పెద్ద రాష్ట్రాల్లో జూన్ 30న సర్వే మొదలై అక్టోబర్ 7న తుది జాబితా వెలువడనుంది. నాగాలాండ్, త్రిపుర వంటి ఈశాన్య రాష్ట్రాల్లో వేర్వేరు తేదీల్లో ఈ ప్రక్రియ జరగనుండగా, డిసెంబర్ నాటికి దేశవ్యాప్తంగా మూడో దశ ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఈసీ లక్ష్యంగా పెట్టుకుంది.
దేశవ్యాప్తంగా ఉన్న ఓటర్లలో మెజారిటీ ఓటర్ల వివరాల సేకరణ ఇప్పటికే పూర్తయినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. బిహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు వంటి 13 ప్రధాన రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మొదటి రెండు దశల కింద ఓటర్ల సవరణ ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. ఇప్పటి వరకు జరిగిన ఈ కసరత్తులో సుమారు 59 కోట్ల మంది ఓటర్ల డేటాను పరిశీలించి సవరించారు. ఆయా దశల్లో 6.3 లక్షల మంది బీఎల్ఓలు, 9.2 లక్షల మంది బీఎల్ఏలు పాలుపంచుకుని భారీ స్థాయిలో ఓటరు కార్డుల అనుసంధాన ప్రక్రియను చేపట్టారు. తాజాగా ప్రకటించిన మూడో దశతో దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా ఓటరు జాబితా ప్రక్షాళన పూర్తి కానుంది, ఇది రాబోయే ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించనుంది.



# గవర్నర్ వాహనాల కుదింపు



మొదటిపేజీ తరువాయి

నిర్ణయం తీసుకున్నారు.
ప్రధాని సందేశానికి సంపూర్ణ మద్దతు ప్రకటించిన గవర్నర్, వాహనాల వినియోగాన్ని తగ్గించే కార్యక్రమాన్ని తాము ఇప్పటికే అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాజ్ భవన్ (లోక్ భవన్)లో సైతం సగం వాహనాలను తగ్గించినట్లు ఆయన వెల్లడించారు. వాహనాల సంఖ్య తగ్గించడం ద్వారా ప్రభుత్వ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని, పరిపాలనలో ఇంధన వినియోగాన్ని సమర్థవంతంగా నియంత్రించవచ్చని గవర్నర్ అభిప్రాయపడ్డారు. ఇది పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, అధికారులు కూడా ప్రధాని మోదీ ఇచ్చిన ఇంధన పొదుపు సందేశాన్ని అమలు చేయాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల కోరారు. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఈ దిశగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని సూచించారు.
అలాగే రాష్ట్ర ప్రజలు కూడా ప్రధాని విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుని ఇంధన వినియోగాన్ని తగ్గించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ చిన్న చిన్న మార్పులతో పెద్ద స్థాయిలో ఇంధన పొదుపుకు సహకరించవచ్చని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో కూడా ఈ అంశంపై అవగాహన కల్పించాలని గవర్నర్ సూచించారు. విద్యార్థుల్లో ఇంధన పొదుపు అలవాట్లను పెంపొందించేందుకు కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా ప్రధాని మోదీ పిలుపు దేశవ్యాప్తంగా అమలవుతున్న నేపథ్యంలో, తెలంగాణ గవర్నర్ తీసుకున్న ఈ నిర్ణయం పరిపాలనలో ఇంధన పొదుపు దిశగా మరో అడుగుగా భావించబడుతోంది.

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

మొదటిపేజీ తరువాయి



ఆయన విజ్ఞప్తి చేశారు.
ఈ రోజు కూసుమంచి మండలం పాలేరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల పనితీరు, ధాన్యం సేకరణ ప్రక్రియ, రవాణా వ్యవస్థ, నిల్వ సదుపాయాలపై అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో సుమారు 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కొనుగోలు కేంద్రం ద్వారా రైతుల నుంచి నేరుగా ధాన్యం సేకరించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.
ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ప్రధానంగా ఎదురవుతున్న ట్రాన్స్‌పోర్ట్, హమాలీల సమస్యలను ప్రభుత్వం గుర్తించిందని మంత్రి తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ధాన్యం సేకరణకు ఎలాంటి ఆటంకం లేకుండా వ్యవస్థను సరిచేస్తున్నామని వివరించారు. హమాలీల కొరత సమస్యపై మాట్లాడుతూ బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి ఎక్కువ సంఖ్యలో హమాలీలు తెలంగాణకు వస్తారని తెలిపారు. అయితే ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ప్రక్రియ కారణంగా అక్కడి నుంచి హమాలీల రాక తగ్గిందని, దీంతో కొంత కొరత ఏర్పడిందని మంత్రి పేర్కొన్నారు.
ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ధాన్యం రవాణా కోసం అవసరమైన లారీలు, డీసీఎంలను తక్షణమే సమకూర్చాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వ ఉండకుండా వేగంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. ధాన్యం తూకం, కొనుగోలు, చెల్లింపుల ప్రక్రియలో పారదర్శకత ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.
కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. తాగునీరు, నీడ, నిల్వ సౌకర్యాలు వంటి అవసరమైన అన్ని ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతుల శ్రమకు తగిన గౌరవం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని ఈసారి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. మొత్తంగా రాష్ట్రంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని, ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు.




# శంకర్‌పల్లిలో పారిశుద్ధ్య కార్మికులకు బెదిరింపులు

- **మాజీ సూపర్‌వైజర్ హరిదాస్‌పై కార్మికుల ఆందోళన**

శంకర్‌పల్లి మే 14(ప్రజాక్షేత్రం):

శంకర్‌పల్లి మున్సిపాలిటీలో ఇంటింటి చెత్త సేకరణ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను మాజీ సూపర్‌వైజర్ హరిదాస్ తీవ్రంగా వేధిస్తున్నాడని కార్మికులు ఆరోపించారు. కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేయడం, ప్రైవేట్ వాహనాలను తీసుకువచ్చి పనుల్లో ఇబ్బందులు కలిగించడం వంటి చర్యలకు పాల్పడినట్లు తెలిపారు. హరిదాస్ లంచం తీసుకున్నట్లు ఆధారాలు బయటపడడంతో మున్సిపల్ కమిషనర్ హెచ్చరించగా ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోయాడని కార్మికులు పేర్కొన్నారు. అయితే తన ఉద్యోగం పోవడానికి కార్మికులే కారణమంటూ వారిని చంపేస్తానని బెదిరిస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిహెచ్ఎంసి స్వచ్ఛ ఆటోటిప్పర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కలమడుగు రాజేందర్ మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే సంబంధిత వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణు, శేషు, డబ్బాల కృష్ణ, రాజు, మహేందర్, శివ, నందు, నాగేష్, శ్రీను, రవి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఒకే వర్గానికే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ ఆగ్రహం

**శంకర్‌పల్లి, మే 14(ప్రజాక్షేత్రం):**



శంకర్‌పల్లి మున్సిపాలిటీలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ ఆరోపించారు. ఒకే వర్గానికి ఇళ్లను కేటాయించడం చట్టవిరుద్ధమని, ఇప్పటివరకు చేసిన కేటాయింపులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సమానంగా అందాల్సి ఉండగా, ప్రత్యేకంగా ఒక కాంగ్రెస్ పార్టీ వర్గానికే ఇళ్లు కేటాయించడం అప్రజాస్వామిక చర్య అని విమర్శించారు. ఈ వ్యవహారంతో పట్టణ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. స్థలం లేని నిరుపేద కుటుంబాలను గుర్తించి పారదర్శకంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని కోరారు. ఇప్పటికే ఇచ్చిన కేటాయింపులను రద్దు చేసి అర్హుల జాబితాను మళ్లీ పరిశీలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




## సైబర్ నేరాలు, దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

**కుషాయిగూడ, మే 14(ప్రజా క్షేత్రం):**

కాలనీల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఏసీపీ వెంకట్‌రెడ్డి కోరారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ కాలనీల అధ్యక్షులతో గురువారం కమ్యూనిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నివారణ, మేడ్స్ సర్వెంట్ల వివరాల నమోదు, రోడ్డు భద్రత, మహిళల రక్షణ, వేసవి కాలంలో దొంగతనాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం నగరంలో చోటుచేసుకుంటున్న ఘటనల నేపథ్యంలో నేపాలీ సర్వెంట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ భాస్కర్‌రెడ్డి, డీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాలనీల భద్రతలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఎస్సైలు సాయిలు, సుధాకర్‌రెడ్డి, వెంకన్న, సతీష్, విజయ్, సీడీఈడబ్ల్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కూలర్‌లో నీరు నింపుతుండగా విషాదం.. కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

**కుషాయిగూడ, మే 14(ప్రజా క్షేత్రం):**



మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో కరెంట్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏఎస్‌రావునగర్‌కు చెందిన కృష్ణ బుధవారం రాత్రి ఇంటి బాల్కనీలో ఏర్పాటు చేసిన ఐరన్ ఎయిర్ కూలర్‌లో నీరు నింపుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కూలర్‌కు విద్యుత్ ప్రవాహం ఉండడంతో చేతి తగలగానే ఒక్కసారిగా కిందపడిపోయాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే విద్యుత్ స్విచ్ ఆఫ్ చేసి, అపస్మారక స్థితిలో ఉన్న కృష్ణను 108 అంబులెన్స్ ద్వారా పోలోమి ఆసుపత్రికి తరలించారు. అక్కడ విధుల్లో ఉన్న వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు సెకండ్ ఒపీనియన్ కోసం గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడి వైద్యులు కూడా ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు మనీత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కుషాయిగూడ ఎస్‌హెచ్‌వో ఎల్. భాస్కర్ రెడ్డి తెలిపారు.

## రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

**వరంగల్, మే 14(ప్రజాక్షేత్రం):**



పూర్వికుల ఆస్తిని తన పేరుపై మ్యూటేషన్ కోసం సంప్రదించిన బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తహసీల్ కార్యాలయంలో ఆర్‌ఐగా పనిచేస్తున్న జి రాంబాబు బాధితుడి నుంచి రూ. 10 వేలు తీసుకుంటుండగా గురువారం వరంగల్ రేంజ్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని ఆర్‌ఐపై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరు పరిచినట్లు ఏసీబీ అధికారులు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 అనే నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, వాట్సప్ నంబర్ 9440446106కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

# మహిళల భద్రతే లక్ష్యం..

- **నేపాలీ ముఠాలపై అప్రమత్తంగా ఉండాలి**

**చర్లపల్లి, మే 14(ప్రజా క్షేత్రం):**

మహిళల భద్రతతో పాటు ఇటీవల వెలుగులోకి వస్తున్న నేపాలీ ముఠాల మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చర్లపల్లి పోలీసులు సూచించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో గురువారం చర్లపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. సుధాకర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, సిబ్బందితో కలిసి రెండు వేర్వేరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మొదటగా చర్లపల్లిలోని సన్‌షైన్ కంపెనీలో మహిళా ఉద్యోగులతో సమావేశమై మహిళా భద్రతపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, 181 హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగంపై వివరించారు. వేధింపులు, దుర్భాషలు ఎదురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మొబైల్‌లో అత్యవసర నంబర్లను సేవ్ చేసుకోవడం, పరిసరాల పట్ల అప్రమత్తంగా ఉండడం, మొబైల్ వినియోగంలో జాగ్రత్తలు పాటించడం వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమానికి సుమారు 40 మంది మహిళా ఉద్యోగులు హాజరయ్యారు. అనంతరం చిన్న చర్లపల్లిలోని షికారా ట్రాంక్విల్ విల్లా నివాసితులతో సమావేశమై ఇటీవల కొన్ని ప్రాంతాల్లో వెలుగులోకి వస్తున్న నేపాలీ ముఠాల మోసపూరిత పద్ధతులపై అవగాహన కల్పించారు. కాలనీల్లో పనిచేస్తున్న కార్మికుల వివరాలను ధృవీకరించుకోవాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం, రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, మహిళల భద్రత కోసం టిసేఫ్ యాప్ వినియోగించాలని సూచించారు.






## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా కక్కిరాల రమేష్

**దమ్మపేట మే 14(ప్రజాక్షేత్రం):**



దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా కక్కిరాల రమేష్‌ను నియమిస్తున్నట్లు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గురువారం ప్రకటించారు. ఈ నియామకంపై నూతన అధ్యక్షుడు కక్కిరాల రమేష్ తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న మరియు సహకరించిన ప్రతీ ఒక్క మండల సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కక్కిరాల రమేష్ నియామకం పట్ల దమ్మపేట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు.

## విద్యా వారోత్సవాల్లో పాల్గొన్న వార్డు సభ్యులు

**దమ్మపేట మే 14(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99రోజుల ప్రణాళికలో భాగంగా మే 11 నుండి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యా వారోత్సవాలు నిర్వహించనున్న సందర్భంగా దమ్మపేట పంచాయతీ పరిధిలో పలు ప్రాథమిక పాఠశాలలో, జెడ్పిహెచెస్ లో సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, కార్యదర్శి బండి అనంత్ కుమార్, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, గోళ్ళ భవాని కృష్ణ యాదవ్, చాట్ల శ్రీనివాసరావు, బత్తుల సాయి, ఉయ్యాల లక్ష్మీనారాయణ, దాసరోజు సరిత రామారావు, చిన్నశెట్టి నాగలక్ష్మి ముక్తేశ్వరరావు, పసుమర్తి కుసుమాంబ, ధర్మసోతు పద్మ తదితరులు గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని పాఠశాలల మౌలిక సదుపాయాలు, విద్య నాణ్యతను పెంచడం, బడిబాట కార్యక్రమాల ద్వారా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ఉపాధ్యాయ సిబ్బంది ద్వారా తల్లి తండ్రులకు వివరించారు. ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యం విద్యారంగ అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం మరియు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నందున, పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించడం ఉత్తమం అని పాలక వర్గ సభ్యులు తెలియజేశారు.




## విలీన గ్రామాల్లో మహిళా సంఘాలపై ప్రత్యేక దృష్టి

- **ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు**
- **మెప్మా పీడీ స్వరూపారాణి**

**కరీంనగర్ రూరల్, మే 14(ప్రజాక్షేత్రం):**

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విలీన గ్రామాల్లో మహిళా సంఘాల బలోపేతం, జీవనోపాధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల పురోగతిపై మెప్మా ఆధ్వర్యంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. చింతకుంట, మల్కాపూర్, లక్ష్మీపూర్, బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామాలకు చెందిన ఏఎల్ఎఫ్, టీఎల్ఎఫ్ ప్రతినిధులు, సంఘ బాధ్యులు, కమ్యూనిటీ నిర్వాహకులు, పట్టణ మిషన్ సమన్వయకర్తలు సమావేశంలో పాల్గొన్నారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ స్వరూపారాణి మాట్లాడుతూ మహిళా సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలంగా నిలవాలంటే క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన పని తీరుతో ముందుకు సాగాలని సూచించారు. జీవనోపాధి కార్యక్రమాల అమలు, బ్యాంకు రుణాల అనుసంధానం, సామాజిక భద్రత పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ఫీల్డ్ స్థాయిలో నిర్లక్ష్యం లేకుండా పని చేయాలని సూచించారు. ప్రతి కార్యక్రమాన్ని నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో మరింత అవగాహన కల్పిస్తూ మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడే ఉపాధి అవకాశాలను విస్తృతంగా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. సంఘ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించి రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. విలీన గ్రామాల్లో మహిళా సంఘాల పనితీరు మెరుగుపడేందుకు ప్రతినిధులు, కమ్యూనిటీ నిర్వాహకులు, పట్టణ మిషన్ సమన్వయకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతి కార్యక్రమంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ పురోగతి నివేదికలను నిర్ణీత సమయంలో సమర్పించాలని సూచించారు. షప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్వరూపారాణి కోరారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, మహిళా సంఘాల నిర్వాహకులు, ఏఎల్ఎఫ్, టీఎల్ఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## వరుస మోటర్ సైకిల్ దొంగతనాలు చేస్తున్న దొంగ అరెస్ట్

**సంగారెడ్డి మే 14(ప్రజాక్షేత్రం):**

సదాశివపేట పట్టణ మరియు పరిసర ప్రాంతాలలో వరుసగా మోటార్ సైకిల్ దొంగతనాలు చేస్తున్నటువంటి వ్యక్తిని సదాశివపేట పోలీసులు పట్టుకొని అతడి నుంచి మూడు ద్విచక్రవాహనలను స్వాధీనం చేసుకున్నారు. సదాశివపేట పట్టణ ఇన్స్పెక్టర్ డి.వెంకటేష్ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. నేరస్తుడు ఇష్రీతాబాద్ గ్రామానికి చెందిన బలరాం సంగమేశ్వర్ అను అతను జల్సాలకు, మద్యానికి అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకొని ఇదే నెలలో ఇష్రీతాబాద్ గ్రామంలో పల్సర్ బైక్, ఆత్మకూరు గ్రామంలో గ్లామర్ బైక్, సదాశివపేట పట్టణంలో స్ప్లెండర్ ప్లస్ బైక్ ని దొంగతనం చేసినట్లు పోలీసులు గుర్తించారు. అతని వద్ద నుండి మూడు బైకులను స్వాధీనం చేసుకొని నేరస్తుడిని రిమాండ్ కు తరలించినట్లు సదాశివపేట ఇన్స్పెక్టర్ డి.వెంకటేష్ తెలిపినారు. దొంగలను పట్టుకున్న ఐడి పార్టీ కానిస్టేబుల్ వెంకటేశం, అమానుల్లా, నహీద్ పాష, మల్లేశంను ఇన్స్పెక్టర్ అభినందించారు.



## దుండిగల్‌లో భారీ గంజాయి పట్టివేత

- **63 కిలోల గంజాయితో ముగ్గురు అరెస్ట్**
- **ఎస్ఓటీ–దుండిగల్ పోలీసుల సంయుక్త ఆపరేషన్ సక్సెస్**


**కుత్బుల్లాపూర్ మే 14(ప్రజాక్షేత్రం):**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని దుండిగల్ పోలీస్ స్టేషన్ పోలీసులు, కుత్బుల్లాపూర్ జోన్ ఎస్‌వోటీ బృందంతో కలిసి భారీ గంజాయి రాకెట్‌ను ఛేదించారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 63.07 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన రవీంద్ర అంకుష్ కేవటే, మనోజ్ సన్ పవర్, చైతన్య మహేంద్ర కుటే అనే ముగ్గురు నిందితులు ఒడిశా రాష్ట్రంలోని సుఖ్మా జిల్లా నుంచి మహారాష్ట్రలోని పూణేకు హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ మరియు నాందేడ్ మార్గం ద్వారా గంజాయి తరలిస్తున్నారు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు, కుత్బుల్లాపూర్ జోన్ ఎస్‌వోటీ బృందంతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్కార్ట్ వాహనంగా ఉపయోగిస్తున్న బాలెనో కారుతో పాటు ఇన్నోవా వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో 26 ప్యాకెట్లలో సుమారు 63 కిలోల గంజాయి లభ్యమైంది. అదేవిధంగా నాలుగు మొబైల్ ఫోన్లు, రెండు నంబర్ ప్లేట్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌ను డీసీపీ ఎస్‌వోటీ పి. శోభన్, అడిషనల్ డీసీపీ ఎ. విశ్వప్రసాద్, మేడ్చల్ డివిజన్ ఏసీపీ సి. శంకర్ రెడ్డి పర్యవేక్షించారు. ఎస్‌వోటీ కుత్బుల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ ఆర్. శ్యామ్సుందర్ రెడ్డి, దుండిగల్ ఇన్‌స్పెక్టర్ పి. సతీష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎం. బాల్ రెడ్డి, ఎస్ఓటి ఎస్ఐ కె. రాజేష్ తదితరుల బృందం నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసింది. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించి, నగదు బహుమతులు ప్రకటించారు.



# కరీంనగర్‌లో ప్రైవేట్ ఆసుపత్రుల దందాపై ఎమ్మెల్యే సత్యం ఫైర్

- **అనుభవంలేని వైద్యులతో శస్త్రచికిత్సలు.. లక్షల బిల్లులతో దోపిడీ**
- **సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు లేఖ**


DISTRICT CONGRESS COMMITTEE
KARIMNAGAR
Office:H.No.3-31,IndiraBhavan,Padmanagar,Karimnagar-505001

Dr.Medipalli Sathyam
President
MLA, Choppadandi

Date:14-05-2026

To
The District Collector
Karimnagar.

Madam,

Sub:- Conducting a Comprehensive Inquiry into the Private Hospitals located in Karimnagar - Reg.
-@-

As you are aware that Private Hospitals are currently springing up indiscriminately in Karimnagar Town often without any prior experience in the field. In many of these establishments basic infrastructure is woefully lacking. Numerous wealthy individuals are colluding to launch these private hospitals with a purely commercial mindset. Consequently, they hire unqualified Doctors and Staff at meager salaries and have them perform surgeries, thereby putting patients' lives at risk. Furthermore, the maintenance of essential facilities such as Elevators, Wheelchairs and Beds are abysmal, and patients are suffering due to the lack of proper sanitation. Even for minor ailments, unnecessary diagnostic tests are being conducted, resulting in bills running into lakhs of rupees.

There is an urgent need to conduct a comprehensive enquiry into the irregularities occurring within these private hospitals and to take appropriate remedial measures.

I, therefore request you to look into the matter personally and a comprehensive enquiry be conducted into all hospitals in Karimnagar as early as possible

Yours Sincerely

**కరీంనగర్, మే 14(ప్రజాక్షేత్రం):** కరీంనగర్ పట్టణంలో విచ్చలవిడిగా పెరుగుతున్న ప్రైవేట్ ఆసుపత్రుల వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించాలని చొప్పదండి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. ప్రజారోగ్యంతో వ్యాపారం చేస్తూ పేదలను దోచుకుంటున్న ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని అనేక ప్రైవేట్ ఆసుపత్రుల్లో కనీస మౌలిక వసతులు కూడా సరిగా లేవని ఆరోపించారు. అనుభవం లేని డాక్టర్లు, సిబ్బందిని తక్కువ జీతాలకు నియమించి వారితోనే శస్త్రచికిత్సలు చేయిస్తున్నారని విమర్శించారు. దీంతో రోగుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో అవసరమైన లిఫ్టులు, వీల్‌చైర్లు, బెడ్లు వంటి సదుపాయాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య పరిస్థితులు కూడా దయనీయంగా ఉన్నాయని అన్నారు. చిన్న జ్వరానికే అనవసర పరీక్షలు సూచిస్తూ లక్షల్లో బిల్లులు వేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంటూ, జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడుతున్న ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నాణ్యమైన వైద్యం అందించడానికే కట్టుబడి ఉందని, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీని సహించబోమని ఎమ్మెల్యే సత్యం స్పష్టం చేశారు.

# ప్రైవేట్ ఆస్పత్రులపై ఆకస్మిక తనిఖీలు

- **నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు**
- **లిఫ్టు పనిచేయకపోవడంతో డిఎంహెచ్ వో ఆగ్రహం**

**కరీంనగర్, మే 14 (ప్రజాక్షేత్రం):** కరీంనగర్ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ ఆధ్వర్యంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజగోపాల్, పీఓ డీటిటి డాక్టర్ ఉమాశ్రీ, పీఓ ఎంహెచ్ఎన్ డాక్టర్ సన్నా జవీరియాతో కలిసి వన్ హాస్పిటల్‌తో పాటు పలు ఆస్పత్రులను పరిశీలించారు. ఈ సందర్భంగా వన్ హాస్పిటల్‌లో లిఫ్ట్ సరిగా పనిచేయకపోవడంపై డీఎంహెచ్‌వో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రుల్లో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, పారిశుధ్యం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, రికార్డుల నిర్వహణ, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం అమలు తదితర అంశాలను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి ఆస్పత్రి బాధ్యత అని డాక్టర్ వెంకట రమణ పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలు జరిగితే ప్రైవేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోగుల భద్రత, అత్యవసర సేవలు, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని ఆస్పత్రి యాజమాన్యాలకు సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.



# ఇంటింటికీ 'బడిబాట'.. పిల్లలందరినీ బడికి పంపుదాం!

- **మొయినాబాద్‌లో ప్రజాప్రతినిధుల విద్యా చైతన్యం.**
- **ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకోవాలి**
- **సర్పంచ్ రాజేందర్ రెడ్డి**

**మొయినాబాద్, మే 14(ప్రజాక్షేత్రం):** ప్రతి బిడ్డ చేతిలో పుస్తకం ఉండాలి.. ప్రతి ఇంటా అక్షర జ్యోతి వెలగాలన్న లక్ష్యంతో మొయినాబాద్ మండలంలో 'బడిబాట' కార్యక్రమం హోరెత్తింది. ఖాసీంబౌలి, నజీబ్ నగర్ గ్రామాల్లో సర్పంచ్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి, ప్రభుత్వ బడుల్లో ఉన్న ఇంగ్లీష్ మీడియం బోధన, ఉచిత పుస్తకాలు, భోజన సౌకర్యాల గురించి వివరించారు. బడి వయసున్న ఏ ఒక్క పిల్లవాడు బయట ఉండకూడదని, అందరినీ బడిలో చేర్పించి గ్రామ గౌరవాన్ని చాటాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేష్ , వార్డు సభ్యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# పోలీసులకు నిరసనకారులకు మధ్య తోపులాట

- **పేట్ బషీరాబాద్ పీఎస్ ముట్టడించిన ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, మహిళా సంఘాలు**
- **ఆందోళనకారుల అరెస్టు.. పలువురు ప్రజా సంఘాల నాయకుల హౌస్ అరెస్ట్**

**కుత్బుల్లాపూర్, మే 14(ప్రజాక్షేత్రం):** మైనర్ బాలిక వేధింపుల కేసులో బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై తక్షణ చర్యలు తీసుకుని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, మహిళా సంఘాల నాయకులు గురువారం పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. బాధితురాలికి న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించిన ఆందోళనకారులు నిందితుడిపై వెంటనే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన మరింత ఉధృతం కావడంతో పోలీసులు వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నించగా ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి నిరసనలో పాల్గొన్న పలువురు వివిధ సంఘాల నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ వాహనాల్లో తరలించారు. మరోవైపు ప్రజాసంఘాలకు చెందిన కొంతమంది నాయకులను ముందస్తు చర్యగా హౌస్ అరెస్టు చేసినట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.





# జనహృదయ దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఉషాకిరణ్ యూత్ సభ్యులు

**సంగారెడ్డి మే 14(ప్రజాక్షేత్రం):** సదాశివపేట పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మరియు 12 వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి దంపతులను ఉషాకిరణ్ యూత్ సభ్యులు ఘనంగా శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి హార్దిక పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇట్టి సందర్భంగా రవి, సురేష్‌లు మాట్లాడుతూ మా మిత్రుడు రాజు ఇంత పెద్ద స్థాయిలో ఉన్నందుకు మాకు చాలా గర్వకారణమని, రానున్న రోజుల్లో మరిన్ని పెద్ద పదవులు చేపట్టి సామాజిక కార్యక్రమాలలో ముందుండాలని ఆ భగవంతుణ్ణి వేడుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో యూత్ పెద్దలు బామిని రవి, వెంకన్న, చీలం సురేష్, హరీష్, అంజి గౌడ్, అనిల్, గుణాకర్, వడ్ల సతీష్, వేణు, మనోజ్, అఖిల్ సోమ శంకర్ మొదలగు వారు పాల్గొన్నారు.



# అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్

**దేవరకద్ర మే 14(ప్రజాక్షేత్రం):** మదనపురం మండలం తిరుమలయ్య పల్లి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ.. ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. అన్ని వర్గాలకు సమ హక్కులను కల్పిస్తూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని, అంబేద్కర్ స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ ముందుకు పోతుందని అన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అందరం అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వాల్మీకి బోయలకు ఎస్టీ హోదా కల్పించాలి

- **సీఎం రేవంత్ రెడ్డికి బోయ సంఘం వినతి**

**నర్వ, మే 14(ప్రజాక్షేత్రం):** వాల్మీకి బోయ సమాజాన్ని షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ) జాబితాలో చేర్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి బోయ సంఘ నాయకులు వినతి పత్రం సమర్పించారు. సమాజం సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా తీవ్ర వెనుకబాటుకు గురైందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది కూలి పనులు, అటవీ ఆధారిత జీవనంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. విద్యలో వెనుకబాటు, ప్రభుత్వ ఉద్యోగాల్లో తక్కువ ప్రాతినిధ్యం, పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలతో వాల్మీకి బోయలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సమాజ పరిస్థితులపై ప్రత్యేక అధ్యయనం నిర్వహించి, ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి అధికారిక సిఫారసు పంపాలని కోరారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో



తగిన ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా తమ హక్కులను కోరుతున్నామని, సమాజ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం న్యాయం చేయాలని బి. ఆంజనేయులు కోరారు.

# టేకుల సోమారం గ్రామంలో రైతుల ఆధ్వర్యంలో ధర్నా

- **గ్రామ సర్పంచ్ పనుమటి మమత నరేందర్ రెడ్డి**

**వలిగొండ మే 14(ప్రజాక్షేత్రం):** రైతులు పండించిన పంట కొనుగోలు చేయడంలో ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యం చేస్తున్నారని మమతా నరేందర్ రెడ్డి ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పడితే రైతుల పరిస్థితి ఏంటని అన్నారు. నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వడ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చెసారు. లేని పక్షంలో రైతులతో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేస్తామణి ప్రభుత్వాన్నీ హెచారించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఉప సర్పంచ్ అశోక్ గౌడ్, రైతులు పనుమటి వెంకట్ రామ్ రెడ్డి, రాజమల్లు, శ్యామల సుదర్శన్ రెడ్డి, పనుమటి అనంత రెడ్డి, మంధడి వెంకట్ రెడ్డి, పనుమటి నర్సి రెడ్డి, ధండెం వెంకట్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, చెగూరి నరేష్, శ్యామల యాధిరెడ్డి, పల్లె శ్రీశైలం, దండబోయిన బుచయ్య, ఎ్ర మల్లేష్, మంధడి రంజిత్, సారెడ్డి సతీష్ రెడ్డి, పనుమటి మహేందర్ రెడ్డి, పాక బాలకృష్ణ, చెగురి యెల్లస్వామి, మహిళా రైతులు, యువకులు పాల్గొన్నారు.



# ఈనెల 16న తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

**వలిగొండ మే 14(ప్రజాక్షేత్రం):** ఈనెల 16న హైదరాబాదులో బషీర్బాగ్ సూరవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా టియువి అధ్యక్షులు సంగిశెట్టి జనార్దన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నారు జిల్లాలో ఉన్నటువంటి ప్రతి ఉద్యమకారుడు సమావేశం హాజరుకావాలని ఉద్యమకారులకు రావలసిన న్యాయమైన డిమాండ్ల కోసం ప్రభుత్వం పై ఒత్తిడి చేద్దామని ఆయన అన్నారు.



# అక్షరాస్యతే లక్ష్యం.. ఊరూరా బడిబాట హోరు!

- **వెంకటాపూర్‌లో ఎంఈఓ మల్లయ్య చైతన్య యాత్ర**
- **ఇంటింటికీ తిరిగి అవగాహన.. ఊరూరా ర్యాలీలు**

**మొయినాబాద్, మే 14(ప్రజాక్షేత్రం):** పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు చదువే పునాది అని మొయినాబాద్ ఎంఈఓ మల్లయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో నిర్వహించిన 'బడిబాట' కార్యక్రమంలో ఆయన పాల్గొని, ఊరూరా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో బడి ఈడు పిల్లలు ఎవరూ బయట ఉండకూడదని, వంద శాతం అక్షరాస్యత సాధించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సర్కారు బడుల్లో ఇంగ్లీష్ మీడియం బోధన అందుబాటులో ఉందని, ఉచిత పుస్తకాలు, దుస్తులు అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు , విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# అందరిదీ ఒకే కుటుంబం....

- కలిసి సమన్వయతో ముందుకెళ్దాం
- పోలీస్ అధికారులకు సూచించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్ బ్యూరో 14(ప్రజాక్షేత్రం):**

పోలీసులది అంతా ఒకే కుటుంబం.. కలిసి సమన్వయతో విధులు నిర్వహించడం మన బాధ్యత... ప్రజలకు రక్షణగా ఉండటమే మన కర్తవ్యం మనమంతా కలిసి ముందుకెళ్తే ఏలాంటి సమస్య తలెత్తవని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పోలీసులకు సూచించారు. ఎస్పీ స్నేహ మెహ్రా ఆద్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఏఆర్ దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ జిల్లా ఏఆర్ కు చెందిన అధికారులు, సిబ్బందితో సమావేశమై, ముఖాముఖిగా మాట్లాడి విధుల నిర్వహణ సమయంలో క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులు, వ్యక్తిగత సమస్యలు, కుటుంబ పరమైన ఇబ్బందులు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి పోలీస్ సిబ్బంది సమస్యలను ఓర్పుతో విని, వారికి తగిన సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మనం అందరం ఒకే కుటుంబం, అందరం కలసి మెలసి సమన్వయంతో విధులలో పాల్గొని ప్రజలకు మంచి చేయాలి. ప్రతి ఒక్కరూ ఓపికగా, సహనంతో, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణలో లేదా వ్యక్తిగత జీవితంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు నిరాశ చెందకుండా ధైర్యంగా ముందుకు సాగాలని, తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని ఎస్పీ సూచించారు. పోలీస్ అధికారులు ధైర్యంగా ఉండి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, సమాజానికి రోల్ మోడల్‌గా వ్యవహరించాలని పేర్కొన్నారు. వృత్తి పరమైన గానీ, కుటుంబ పరమైన గానీ సమస్యలు ఎదురైనప్పుడు వాటిని మనసులో పెట్టుకోకుండా తమ సహచరులతో, స్నేహితులతో లేదా ఉన్నతాధికారులతో పంచుకోవాలని, సమస్యలు మరింత తీవ్రమైన స్థాయికి చేరుకుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఎస్పీ తెలిపారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని, ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత జీవితం, విధి నిర్వహణ మధ్య సమతుల్యత పాటిస్తూ ముందుకు సాగాలని సూచించారు. అలాగే మహిళా పోలీస్ అధికారుల సంక్షేమం దృష్ట్యా వెల్ఫేర్ కార్యక్రమాల క్రింద డ్రైవింగ్ శిక్షణ తరగతులను త్వరలో ప్రారంభించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. తాత్కాలిక ప్రయోజనాల కోసం చట్ట విరుద్ధ పనులకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ చట్ట విరుద్ధ కార్యకలాపాలలో భాగస్వాములు కాకూడదని స్పష్టం చేశారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ, సేవాభావం, ప్రజల పట్ల బాధ్యతాయుతమైన వైఖరి ఎంతో ముఖ్యమని పేర్కొన్న జిల్లా ఎస్పీ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి వీరేష్, ఆర్ఐ శ్రీశైలం, ఆర్ఎస్ఐ లు, ఏఆర్ఎస్ఐ లు, ఇతర అధికారులు, ఏఆర్ సిబ్బంది మరియు ఇతర శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలే నాణ్యమైన విద్యకు చిరునామా

- విద్యార్థుల నమోదును పెంచడంలో తల్లిదండ్రుల సహకారం అవసరం
- అంజనగిరి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంజనమ్మ పిలుపు

**వనపర్తి, మే 14(ప్రజాక్షేత్రం):**

ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు సేవలందిస్తున్నారని, వారి మార్గదర్శకత్వంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అంజనగిరి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే. అంజనమ్మ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు నమ్మకం పెంచుకుని తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేర్పించాలని ఆమె కోరారు. వనపర్తి మండలం అంజనగిరి ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి విద్యా వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వివరించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం, పరిశుభ్రమైన వాతావరణం, నైపుణ్యాభివృద్ధికి అనుకూలమైన బోధన వంటి అంశాలు ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకత అని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులలో సృజనాత్మకత, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించే విధంగా బోధన కొనసాగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి బాలబాలిక విద్యను అందుకోవాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతం పెరగాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. అలాగే కొత్త విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచేందుకు తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. సమీపంలోని ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# డిజిటల్ జనగణనలో ఖచ్చితత్వానికి ప్రాధాన్యం

- క్షేత్రస్థాయిలో జనగణన పరిశీలించిన జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్
- ఎన్యూమరేటర్లతో ముఖాముఖి మాట్లాడిన పింకేష్ కుమార్
- సాంకేతిక సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని సూచన

**కుత్బుల్లాపూర్, మే 14(ప్రజాక్షేత్రం):**



జనగణన2027 మొదటి దశలో భాగంగా కొనసాగుతున్న గృహ గణన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కుత్బుల్లాపూర్ జోన్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ గురువారం జీడిమెట్ల సర్కిల్ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా 284గణేశ్ నగర్ పరిధిలోని రిడ్జ్ టవర్ అపార్ట్మెంట్స్, గణేశ్ నగర్, 285వ డివిజన్‌లోని పద్మనగర్ ఫేజ్ 1, సుధర్శన్ రెడ్డి నగర్ ప్రాంతాల్లో జరుగుతున్న గృహ గణన పనులను పరిశీలించారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లతో ముఖాముఖి మాట్లాడి వివరాల నమోదు ప్రక్రియపై సూచనలు చేశారు.

**ప్రతి ఇంటి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలి**

ఈసారి జనగణన ప్రక్రియ పూర్తిగా డిజిటల్ విధానంలో జరుగుతున్నందున, మొబైల్ యాప్‌లో ఇంటి నంబర్లు, కుటుంబ సభ్యుల ప్రాథమిక వివరాలు, గృహ వసతుల సమాచారం ఎక్కడా తప్పులు లేకుండా నమోదు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన 33 రకాల ప్రశ్నలపై ఎన్యూమరేటర్లకు పూర్తి అవగాహన ఉండాలని, ప్రజల నుంచి సేకరించే సమాచారాన్ని అత్యంత గోప్యంగా ఉంచాలని సూచించారు.

**దేశాభివృద్ధికి జనగణన కీలకం**

అనంతరం కమిషనర్ మాట్లాడుతూ దేశాభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనలో జనగణన కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో సెల్ఫ్ ఎన్యూమరేషన్ పూర్తి చేసుకున్న కుటుంబాల డేటాను సిస్టమ్‌లో ధృవీకరించి, సర్వేను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే సూపర్‌వైజర్లు వెంటనే స్పందించి పరిష్కరించాలని, నిర్ణీత గడువులోగా వంద శాతం గణన పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చార్జి సెన్సస్ ఆఫీసర్, ఉప కమిషనర్ డి.శంకర్ సింగ్, అడిషనల్ చార్జి సెన్సస్ ఆఫీసర్ ఉదయ్ కుమార్‌తో పాటు సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

# ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం...
# బాలయ్య బస్తిలో బెల్ట్ షాపుల జోరు

- అక్రమ మద్యం అడ్డాగా బాలయ్య బస్తి.....అధికారులు మాత్రం మౌనం!
- ఎక్సైజ్ అధికారులు నిద్రలోనా?...బెల్ట్ షాపులు మాత్రం ఫుల్ జోష్‌లో!
- "ప్రజల కోసం పని చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు...బెల్ట్ షాపులకు అండగా?"
- యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని తల్లిదండ్రుల ఆందోళన
- శాశ్వత చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖకు ప్రజల డిమాండ్

**కుత్బుల్లాపూర్, మే 14(ప్రజాక్షేత్రం):**

గాజులరామారం మహాదేవపురం సమీపంలోని బాలయ్య బస్తి ప్రస్తుతం అక్రమ బెల్ట్ షాపుల కేంద్రంగా మారిపోయిందనే ఆరోపణలు స్థానిక ప్రజల నుంచే వెల్లువెత్తుతున్నాయి. నివాస ప్రాంతాల మధ్యలోనే ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు జరుగుతుండగా, వాటిని అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత నెల ఏప్రిల్ 2న ఇదే అంశంపై వార్తలు వెలువడినా ఇప్పటివరకు ఎలాంటి శాశ్వత చర్యలు తీసుకోకపోవడం స్థానికుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. అప్పట్లో హడావుడిగా ఒకటి రెండు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్న అధికారులు... మరుసటి రోజే అదే బెల్ట్ షాపులు యథావిధిగా నడుస్తుండటాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**బస్తిలో బెల్ట్ షాపుల రాజ్యం...లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపుతప్పిందా?**

స్థానికుల ఆరోపణల ప్రకారం బాలయ్య బస్తిలో కొన్ని బెల్ట్ షాపులు తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు నిర్భయంగా కొనసాగుతున్నాయి. మద్యం తాగిన వ్యక్తులు రోడ్లపై పడిపోవడం, గొడవలు పెట్టడం, మహిళలను ఇబ్బందులకు గురిచేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. ఈ పరిస్థితులతో రాకపోకలకు కూడా తీవ్ర అంతరాయం కలుగుతోందని ప్రజలు వాపోతున్నారు. "బస్తిలో ఎప్పుడు ఏ గొడవ జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది" అని స్థానికులు అంటున్నారు.

**పోలీస్ స్టేషన్ మెట్లెక్కిన మహిళలు... అయినా ఫలితం శూన్యం!**

సమస్య తీవ్రత పెరగడంతో బాలయ్య బస్తి మహిళలు, యువకులు కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బెల్ట్ షాపుల కారణంగా రాత్రి వేళల్లో రోడ్లపై భయానక వాతావరణం నెలకొంటోందని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఫిర్యాదులు చేసినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. "ఒక్కరోజు దాడులు చేసి ఫోటోలు దిగడం తప్ప... శాశ్వత పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు" అంటూ మండిపడుతున్నారు.

**"ఎక్సైజ్ అధికారులు అసలు విధుల్లో ఉన్నారా?"**

అక్రమ మద్యం విక్రయాలు బహిరంగంగానే జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ స్పందించకపోవడం ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. "కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ అధికారులు నిజంగా విధుల్లో ఉన్నారా? లేక అక్రమ దందాలకు అండగా నిలుస్తున్నారా?" అంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ప్రజల కోసం పని చేయాల్సిన అధికారులు... బెల్ట్ షాపుల తొత్తులుగా మారారా?" అంటూ బస్తివాసులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ దందాలు ఇంత బహిరంగంగా జరుగుతున్నా అధికారులు మౌనం పాటించడం వెనుక కారణాలేమిటని నిలదీస్తున్నారు.

**శాశ్వత పరిష్కారం ఎప్పుడూ?**

బాలయ్య బస్తి ప్రజలు తాత్కాలిక దాడులు, కేసులు కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నివాస ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టాలని, మహిళలు, చిన్నారులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో వచ్చిన వార్తలను కూడా పట్టించుకోని అధికారులు... ఇప్పటికైనా మేల్కొని అక్రమ బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకుంటారా? లేక ప్రజల ఆవేదన ఇలాగే కొనసాగుతుందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు స్థానికుల్లో తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి.





# తాళ్లూరి పంచాక్షరయ్యను మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- ఇరవెండి గ్రామంలో ఆత్మీయ భేటీ
- శాలువాతో సత్కారం, స్థానిక అంశాలపై చర్చ

**బూర్గంపాడు మే 14(ప్రజాక్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం, ఇరవెండి గ్రామంలో గురువారం ఆత్మీయ వాతావరణంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య ను మర్యాదపూర్వకంగా కలిశారు.రాజకీయ జీవితంలో నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దర్శనం కోసం వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దర్శనం అనంతరం నేరుగా ఇరవెండి గ్రామానికి చేరుకుని పంచాక్షరయ్య నివాసంలో భేటీ అయ్యారు. తన నివాసానికి విచ్చేసిన మంత్రిని పంచాక్షరయ్య సాదరంగా ఆహ్వానించి శాలువాతో ఘనంగా సత్కరించారు.అనంతరం జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరూ కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించుకుని స్థానిక పరిస్థితులు, ప్రజా సమస్యలు మరియు అభివృద్ధి అంశాలపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరుపల్లి వంశీకృష్ణ, బూర్గంపాడు పిఎసిఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, తాళ్లూరి రాధాకృష్ణ, తాళ్లూరి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.







## పదేళ్ల కేసీఆర్ పాలనలో పేదలకు ఇండ్లు, రేషన్ కార్డులు ఇవ్వలే

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర, నియోజకవర్గం మే 14(ప్రజాక్షేత్రం):**

పదేళ్ల కెసిఆర్ పాలనలో పేదలకు ఒక్క ఇండ్లు, రేషన్ కార్డులు ఇవ్వలేదు. మా ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇచ్చామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం కొత్త కోట మండలం రామకృష్ణ పురం, గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, శుభాకాంక్షలు తెలియజేసి, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు లకు, మిత్తిలు కట్టుకుంటూ ఇచ్చిన హామీలను నెరవేర్చామని అన్నారు. అందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 2 లక్షల రూపాయల రుణమాఫీ, 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్, 10 లక్షల ఆరోగ్యశ్రీ, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్ల తోపాటు రేషన్కార్డులు ఇచ్చామన్నారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తూ, పైరవీలకు తావు లేకుండా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులను ఇచ్చామన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇస్తామని, ఇది నిరంతర పక్రియ అని తెలియజేసారు. పదేళ్లలో బిఆర్ఎస్ చేయని అభివృద్ధిని, చేసి చూపిస్తున్నామని, ముఖ్యంగా దేవరకద్ర నియోజకవర్గ వ్యాప్తంగా 3500 ఇండ్లు మంజూరు చేశామని, అందులో సుమారు 2300 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగతావి బేస్మెంట్ దశలో ఉన్నాయని అన్నారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు యువకులు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వంకాయ తోట పై గడ్డి మందు పిచికారి నాలుగు లక్షల వరకు పంట నష్టం

- ఎవరికి చెప్పకుంటావో చెప్పకో అని బెదిరింపులు

**వికారాబాద్ బ్యూరో మే 14(ప్రజాక్షేత్రం):**



ఇతను సామాన్య రైతు రెక్కాడితే గాని డొక్కాడని సగటు జీవి ఉన్న పొలంలో కూరగాయలు సాగు చేసుకుని కుటుంబం మొత్తం దానిపైనే బతికే బక్క రైతులు.. అలాంటి రైతుపై పక్క పొలం వ్యక్తి కన్నేసి ఎలాగైనా ఆ భూమిని సొంతం చేసుకోవాలని దురుద్దేశంతో గత నాలుగు ఏళ్లుగా ఈ రైతు పొలంలో గడ్డి మందు పిచికారి చేస్తూ పంట నష్టం చేస్తున్నాడు.. పంట చూసి కన్నీళ్లు పెట్టుకున్న రైతు లబోదిబోమంటూ కన్నీరు మున్నీరవుతున్నారు.. రైతు జాఫర్ కాజా చెప్పిన వివరాల ప్రకారం... కోటిపల్లి మండలం కరీంపూర్ గ్రామానికి చెందిన జాఫర్ కాజా తనకున్న ఎకరం భూమిలో వంకాయ తోటను సాగు చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా ఆయా రకాల కూరగాయ పంటలు సాగు చేసుకుంటూ జీవనం గడుపుతున్న కాజాకు ప్రతి ఏడాది పక్క రైతు గడ్డి మందు పిచికారి చేసి రైతును నట్టేట ముంచుతున్నారు. నాలుగేళ్లుగా తన పంట ఎండిపోవడానికి కారణం ఏమిటో తెలవక అనేక ఇబ్బందుల పడి అప్పలపాలయ్యానని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది యధావతిగా వంకాయ తోట వేసి ఏం జరుగుతుందో చూద్దామని అనుకుంటే పక్క పొలం చెందిన అబువాకర్ సిద్దికీ అనే వ్యక్తి తన చెరుకు తోటలో గడ్డి మందు పిచికారి చేసి కావాలనే తన పొలం కూ ఉన్న జాలిని తొలగించి వంకాయ తోటకు గడ్డి మందు పిచికారి చేశాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు తాను వెంటనే పొయ్యి ఆ వ్యక్తిని ప్రశ్నించానని నీ ఇష్టం ఏం చేసుకుంటే చేసుకో అనే బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అబూ వాకర్ సిద్ధి కనే వ్యక్తి నా పక్కన ఉన్న నా సొంత అన్న పొలాన్ని కొనుగోలు చేశాడని నా పొలం కూడా కాచేయడానికి ఇలా నా పంట నష్టం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గ్రామంలో పంచాయతీ పెట్టగా పెద్దలు సుమారు నాలుగు లక్షల వరకు నష్టపరిహారం అవుతుందని చెప్పారని ఆయన మాత్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వనని బెదిరిస్తున్నాడు అని ఆవేదన చెందారు ఈ విషయం పోలీసులకు కూడా ఫిర్యాదు చేశానన్నారు. జిల్లా ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

## మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి తెచ్చిన పథకాలకే ప్రారంభోత్సవాలు

- మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ విమర్శ

**వనపర్తి, మే 14(ప్రజాక్షేత్రం):**



వనపర్తి నియోజకవర్గంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి తీసుకొచ్చిన శాశ్వత అభివృద్ధి పథకాలకే ప్రస్తుత మంత్రి, ఎమ్మెల్యేలు ప్రారంభోత్సవాలు చేస్తున్నారని బి అర్ ఎస్ జిల్లా అధికార ప్రతినిధి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ విమర్శించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డిజిటల్ జిల్లా గ్రంథాలయం సహా పలు ప్రాజెక్టులకు నిరంజన్‌రెడ్డి నిధులు సాధించారని పేర్కొన్నారు. మార్కెట్ సముదాయం లక్ష్యసాధనలో ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి కొత్త అభివృద్ధి పథకం తీసుకురాలేదని, ప్రకటనలతో ప్రజలను మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. రోడ్ల విస్తరణ పనులు పూర్తిచేయడంలోనూ పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాలేదని, రైతులు ధాన్యం కొనుగోళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు.

# పీఎంజే దొంగతనం కేసును చేధించిన కరీంనగర్ పోలీసులు

- ముఠాలోని ముగ్గురు అరెస్టు.. మరో ఇద్దరు పరారీలోనే
- బీహార్ జైలు నుంచే 'గోల్డెన్ థీఫ్' ఆపరేషన్
- రెండు నెలల ముందే రాష్ట్రంలో రెక్కీ
- మహారాష్ట్ర నుంచి తుపాకుల సేకరణ
- సినిమా ఫక్కీలో కాల్పులు.. బైకులు వదిలి గోదావరి దాటి పరార్
- దొంగలను వెంటాడి.. వేటాడిన కరీంనగర్ పోలీసులు

**కరీంనగర్, మే 14(ప్రజాక్షేత్రం):**




కరీంనగర్ నగరాన్ని వణికించిన ప్రముఖ పీఎంజే జ్యువెలరీ షాప్ దోపిడీ కేసును పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. ఈ కేసులో కీలక నిందితుడితో పాటు ముగ్గురిని అరెస్ట్ చేయగా, అంతర్‌రాష్ట్ర స్థాయిలో పనిచేస్తున్న కరుడుకట్టిన దోపిడీ ముఠా గుట్టురట్టు అయింది. బీహార్ జైలులో ఉన్న 'ది గోల్డెన్ థీఫ్' సుభోద్ సింగ్ ఈ మొత్తం ఆపరేషన్‌కు సూత్రధారి అని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కరీంనగర్ 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జ్యువెలరీ షాపులో ఈ నెల 3వ తేదీన ఘోర దోపిడీ జరిగింది. ఐదుగురు దుండగులు ఆయుధాలతో చొరబడి 101.4 తులాల బంగారు ఆభరణాలు, 112 క్యారెట్ల వజ్రాభరణాలను దోచుకెళ్లారు. వీటి మొత్తం విలువ రూ. 82.02 లక్షలుగా పోలీసులు గుర్తించారు. దోపిడీ సమయంలో షాప్ సిబ్బంది ప్రతిఘటించడంతో నిందితులు జరిపిన కాల్పుల్లో నలుగురు ఉద్యోగులు గాయపడ్డారు. బీహార్ జైలులో ఉన్న సుభోద్ సింగ్ ఆదేశాల మేరకు ఈ ముఠా రెండు నెలల క్రితమే తెలంగాణకు చేరుకుంది. జార్ఖండ్-పశ్చిమ బెంగాల్ సరిహద్దులో మెహతాబ్ ఖాన్ వద్ద ఒక్కో సిమ్ కార్డును రూ. 10 వేల చొప్పున కొనుగోలు చేశారు. దొంగతనాలకు నకిలీ గుర్తింపు కార్డులు, తప్పుడు పేర్లతో లాడ్జ్‌లలో బస చేయడం ఈ గ్యాంగ్ స్టైల్. ఖమ్మం, సిద్ధిపేట, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాల్లో తిరుగుతూ జ్యువెలరీ షాపులపై రెక్కీ నిర్వహించారు. చివరకు కరీంనగర్‌లోని పీఎంజే షాప్‌ను లక్ష్యంగా ఎంచుకుని ధర్మపురిలోని ఒక గెస్ట్ హౌస్‌లో బస చేసి దోపిడీకి వ్యూహం రచించారు.

**కాల్పుల అనంతరం గోదావరి నుంచి ఎస్కేప్..!**

సుభోద్ సింగ్ అనుచరుల సూచనల మేరకు రఘునాథ్ కర్మాకర్ మంచిర్యాలకు వెళ్లి, అక్కడ నుంచి రైలులో మహారాష్ట్రలోని చంద్రపూర్ సమీపానికి చేరుకున్నాడు. అక్కడ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఆరు పిస్టల్, మ్యాగజైను సేకరించి ధర్మపురికి తిరిగి వచ్చినట్లు విచారణలో తేలింది. మే 3వ తేదీ ఉదయం నిందితులు రెండు బైక్‌లపై బయలుదేరి వెలిచాల ఎక్స్ రోడ్ వద్ద బైక్ నంబర్ ప్లేట్లు మార్చారు. ఉదయం 10:50 గంటలకు షాపునకు చేరుకుని, కస్టమర్లలా లోపలికి వెళ్లి సిబ్బందిని తుపాకులతో బెదిరించారు. నగలు దోచుకుంటుండగా సిబ్బంది ఎదురుతిరగడంతో కాల్పులు జరిపి ఒక ఆభరణాల బ్యాగ్‌తో పరారయ్యారు. కంగారులో మరో బ్యాగ్‌ను షాపులోనే వదిలేశారు. అనంతరం గోదావరి నది ఒడ్డున బైక్‌లను వదిలి, నడుచుకుంటూ నది దాటి మంచిర్యాల నుంచి రైళ్లలో వివిధ రాష్ట్రాలకు పారిపోయారు.

**వెలిచాల వద్ద నిందితుడి అరెస్ట్.. పోలీసుల హెచ్చరికలు**

ఈ కేసులో ప్రధాన నిందితుడైన పశ్చిమ బెంగాల్‌కు చెందిన రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జగీరా సింగ్‌ను మే 13 సాయంత్రం వెలిచాల ఎక్స్ రోడ్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఇతనిపై వివిధ రాష్ట్రాల్లో దోపిడీ, హత్య, ఆయుధ చట్టాల కింద ఇప్పటికే 7 కేసులు ఉన్నాయి. మరో ఇద్దరు నిందితులు రావిష్ కుమార్ అలియాస్ ప్రద్యుమన్ (ఇతనిపై 15 కేసులు ఉన్నాయి), మెహతాబ్ ఖాన్‌లను బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకుని ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తరలించారు. సాంకేతిక నిఘా, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఇప్పటివరకు ఈ కేసులో 13 మంది నిందితులను పోలీసులు గుర్తించారు. అరెస్టయిన ముగ్గురి వద్ద నుంచి రూ. 51 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లు, రెండు సిమ్ కార్డులు, నకిలీ గుర్తింపు కార్డులను స్వాధీనం చేసుకున్నారు. గ్యాంగ్ లీడర్ సుభోద్ సింగ్‌తో పాటు పరారీలో ఉన్న మిగిలిన నిందితులు, బంగారం రికవరీ కోసం ఐదు ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జ్యువెలరీ షాపులు, బ్యాంకులు, లాడ్జ్‌ల యజమానులు తప్పనిసరిగా నాణ్యమైన సీసీటీవీ కెమెరాలు, పానిక్ బటన్లు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. లాడ్జ్‌లలో సరైన గుర్తింపు కార్డుల ధృవీకరణ తర్వాతే గదులు ఇవ్వాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని ఆదేశించారు.

## మహబూబ్ నగర్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి మే 14(ప్రజాక్షేత్రం):**



మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలో పర్యాటక మరియు మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ నగరం లోని పిల్లలమర్రిలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించబడినట్లు వెల్లడించారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా సుమారు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయగా, అందులో భాగంగా ఈరోజు రూ.2 .5 కోట్ల వ్యయంతో పలు పనులకు శంకుస్థాపన నిర్వహించినట్లు తెలిపారు. మయూరి పార్క్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగా ట్రెక్కింగ్ ట్రైల్స్, వ్యూ పాయింట్లు, టూరిస్టుల కోసం తాత్కాలిక కాటేజీల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఫారెస్ట్ ఏరియా పరిమితులను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు జరుగుతాయని ఆయన తెలిపారు. అలాగే కురుమూర్తి, మన్నెంకొండ, పిల్లమర్రి వంటి ముఖ్య ఆధ్యాత్మిక కేంద్రాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రధాన లక్ష్యమని అన్నారు. వచ్చే సంవత్సరం నిర్వహించనున్న కృష్ణ పుష్కరాల దృష్ట్యా జిల్లాలోని పురాతన దేవాలయాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సుమారు 150 పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్యమంత్రికి సమర్పించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి కూడా వాటిని ఆమోదిస్తూ జిల్లాలోని ప్రధాన దేవాలయాలన్నింటినీ అభివృద్ధి చేయాలని సూచించినట్లు తెలిపారు. మహబూబ్ నగర్ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా కార్యరూపంలో పనిచేస్తోందని, గతంలో ఉన్న లోటుపాట్లను సరిదిద్దుతూ వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో సమగ్ర అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మమత శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ బడిబాటతో విద్యా చైతన్యం

- చందాపూర్‌లో విద్యా వారోత్సవాలు ఘనంగా నిర్వహణ

**వనపర్తి , మే 14(ప్రజాక్షేత్రం):**

విద్యా వారోత్సవాలలో భాగంగా వనపర్తి మండలం చందాపూర్ గ్రామ పరిధిలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో గురువారం "ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో విద్యా ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థుల చేరికలు పెంపొందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బర్ల నిర్మల మహేందర్, ఉప సర్పంచ్ పుల్లరి నరేందర్ బడిబాట బ్రోచర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. బొజ్జిబాబు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఈశ్వర్, ఉపాధ్యాయులు ఎం. బాలనాగయ్య, వై. విష్ణు, పి. మంజుల, స్రవంతి, సాయి గీత పాల్గొన్నారు. వార్డు సభ్యులు స్వామి, గ్రామ పంచాయతీ కార్యదర్శి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరి విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు.




## తెలంగాణ విద్యకు మోడల్‌గా అంగన్‌వాడీలు

- పెబ్బేరు మండలంలో రూ.49 లక్షలతో 13 కేంద్రాల ఆధునీకరణ
- ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్‌కు ధీటుగా తీర్చిదిద్దుతున్నాం
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి, మే 14(ప్రజాక్షేత్రం):**

తెలంగాణను విద్యారంగంలో దేశంలోనే నెంబర్1 రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం పెబ్బేరు పట్టణం, మండల పరిధిలో ఏర్పాటు చేసిన మోడల్ అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెబ్బేరు మండలంలో ఏబీడీ లిక్కర్ ఫ్యాక్టరీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల కింద రూ.49 లక్షల వ్యయంతో 13 అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించి మోడల్ కేంద్రాలుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఇందులో భాగంగా కంచిరావుపల్లి మండల పరిషత్ పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రం, పెబ్బేరు రెండో వార్డులోని కేంద్రం, చెలిమిల్లలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొని రిబ్బన్ కట్ చేసి కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు త్వరలో అల్పాహార పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సన్నబియ్యం పంపిణీ, మెస్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీల పెంపు వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రత్యేకంగా పెట్టుబడులు పెడుతున్నామని చెప్పారు. ప్రజలు ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలని కోరారు. అలాగే ఏబీడీ కంపెనీ సీఎస్ఆర్ నిధులలో రెండు శాతం విద్యారంగం, పాఠశాలల అభివృద్ధికి వినియోగించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. పాఠశాలలకు కాంపౌండ్ వాల్లు, రవాణా సౌకర్యాల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల్లో 13 అంగన్‌వాడీ కేంద్రాలను మోడల్ కేంద్రాలుగా తీర్చిదిద్దడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సౌకర్యాలను ప్రజలు సంరక్షించుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏబీడీ లిక్కర్ కంపెనీ డైరెక్టర్ రాజేష్, ప్రతినిధులు ఉమాశంకర్, వెంకటేశ్వర్ రెడ్డి, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్‌పర్సన్ సుమిత్ర, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రంథాలయాల అభివృద్ధితోనే జ్ఞాన సమాజం

- **ప్రతి ఇల్లు లైబ్రరీగా మారాలి**
- **మంత్రి జూపల్లి కృష్ణారావు**

**వనపర్తి, మే 14(ప్రజాక్షేత్రం):**

సమాజంలో మార్పు రావాలంటే గ్రంథాలయాల అభివృద్ధి అత్యంత అవసరమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ప్రతి ఇల్లు ఒక చిన్న లైబ్రరీగా మారి జ్ఞాన సమాజ నిర్మాణానికి దోహదపడాలని సూచించారు. కుటుంబ ఖర్చుల్లో కొంత భాగాన్ని పుస్తకాల కొనుగోలుకు వెచ్చించాలని పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా గ్రంథాలయంలో నూతన అంతస్తు ప్రారంభం వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో రూ.కోటితో నిర్మించిన నూతన తొలి అంతస్తును గురువారం మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు నిర్వహించిన మంత్రి, కొత్త అంతస్తును పరిశీలించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి, డిజిటల్ లైబ్రరీతో పాటు కల్పించిన సౌకర్యాలను సందర్శించారు.

**శాలువాలు, బొకేలకు బదులు పుస్తకాలే బహుమతి**

సభలో మంత్రి మాట్లాడుతూ శాలువాలు, బొకేలకు ఖర్చు చేసే సంస్కృతికి స్వస్తి చెప్పాలని సూచించారు. ఆ డబ్బుతో పుస్తకాలు కొనుగోలు చేసి గ్రంథాలయాలకు విరాళంగా అందించాలని పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గంలో సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రూ.10 లక్షల విలువైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి సాంస్కృతిక శాఖ ద్వారా మరో రూ.కోటి నిధులు కేటాయించే దిశగా చర్యలు తీసుకుంటామని, పుస్తకాల కొనుగోలుకు అదనంగా రూ.10 లక్షలు మంజూరు చేస్తామని వెల్లడించారు. వనపర్తి విద్యకు నిలయమని, విద్యా, క్రీడా రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**తెలంగాణలో తొలి డిజిటల్ లైబ్రరీ వనపర్తిలోనే**

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ వనపర్తికి "చదువుల పర్తి"గా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తెలంగాణలోనే తొలి డిజిటల్ లైబ్రరీని వనపర్తిలో ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రంథాలయంలో ఆధునిక సౌకర్యాలు కల్పించామని చెప్పారు. వనపర్తిలో అన్ని రకాల ఉన్నత విద్యాసంస్థలు ఉన్నాయని, నవోదయ విద్యాలయాన్ని కూడా తీసుకురావడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనపర్తిలోనే చదువుకున్నారని గుర్తుచేశారు. పర్యాటక, సాంస్కృతిక శాఖల నుంచి చెరో కోటి రూపాయల నిధులు మంజూరు చేయాలని మంత్రి జూపల్లిని కోరారు.

**'చదువును ఎవరూ దోచుకోలేరు'**

తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ వనపర్తి అంటేనే "విద్యపర్తి"గా ప్రసిద్ధి చెందిందన్నారు. డబ్బును దోచుకోవచ్చు కానీ విద్యను ఎవరూ దోచుకోలేరని వ్యాఖ్యానించారు. గ్రంథాలయానికి మంచి పుస్తకాలు విరాళంగా అందిస్తానని తెలిపారు.

**యువత పుస్తక పఠనంపై దృష్టి పెట్టాలి**

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ యువత అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖాళీ సమయంలో పుస్తకాలు చదివే అలవాటు పెంపొందించుకోవాలని చెప్పారు. గ్రంథాలయంలో అవసరమైన సౌకర్యాల కల్పనకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

**రోజూ 400 మంది విద్యార్థులకు ఉపయోగం**

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ మాట్లాడుతూ ఈ లైబ్రరీకి ప్రతిరోజూ 300 నుంచి 400 మంది విద్యార్థులు చదువుకునేందుకు వస్తున్నారని తెలిపారు. డైనింగ్ హాల్ సహా మరిన్ని మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. కొత్త మండలాల్లో కూడా లైబ్రరీల ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్స్, ఇతర నాయకులు పాల్గొన్నారు.







## వలిగొండ మండలం కేంద్రంలో మెడ్ ప్లస్ మెడికల్ షాప్ ప్రారంభం

**వలిగొండ మే 14(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో మెయిన్ రోడ్ వలిగొండ మండల పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మేడ్ ప్లస్ మెడికల్ షాప్ మన వలిగొండ మండలంలో బత్తిని పద్మ సత్యనారాయణ నూతనంగా ప్రారంభించారు ఆయన మాట్లాడుతూ మావద్ద అన్ని రకాల మందులు భారీ డిస్కౌంట్ 24 గంటల సౌకర్యం కలదు ఈ అవకాశాన్ని మండల పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో వలిగొండ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బండి భగీరథ్ను వెంటనే అరెస్ట్ చేయాలి

- **సిర్పంగి స్వామి సిపిఎం మండల కార్యదర్శి**

**వలిగొండ మే 14(ప్రజాక్షేత్రం):**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ప పోక్సో కేసు నమోదు చేసినప్పటికీ ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం ఎందుకని ప్రభుత్వాన్ని, పోలీసులను ప్రశ్నించారు. ఇలాంటి కేసుల్లో సామాన్యులకు ఒక న్యాయం, కేంద్ర మంత్రి కుమారుడికి మరో న్యాయమా అని నిలదీశారు. గురువారం వలిగొండ మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతూ, బాధిత బాలికను వేధించి బలవంతంగా మద్యం తాగించి అత్యాచారం చేసిన కేసులో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. గతంలో కూడా బండి భగీరథ్‌ప ర్యాగింగ్, విద్యార్థులపై దాడులు వంటి ఆరోపణలు ఉన్నాయని గుర్తు చేశారు. దేశం, ధర్మం గురించి మాట్లాడే బీజేపీ నాయకులు ఈ ఘటనపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వన ఉపేందర్. మండల కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు వెంకటేశం మండల కమిటీ సభ్యులు దుబ్బ లింగం వలిగొండ పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ శీలం ఇందిరా తదితరులు పాల్గొన్నారు.





## ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ బడిబాట

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (ప్రజాక్షేత్రం )**

ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్‌కు చెందిన అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ఆదిలాబాద్ సిబ్బంది ముక్రా (బి) గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని విద్యార్థులు, తల్లిదండ్రులను కలిసి పాఠశాలలో అందిస్తున్న విద్యా సౌకర్యాలు, హాస్టల్ వసతి, క్రమశిక్షణతో కూడిన అభ్యాస వాతావరణంపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో సి ఆర్ టి రవికాంత్ రెడ్డి మాట్లాడుతూ, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పూర్తి స్థాయి హాస్టల్ వసతి, మెరుగైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా అనాథలు, అర్థానాథలు, వివిధ కారణాలతో చదువు మధ్యలో మానేసిన విద్యార్థులు, సంచార జాతుల పిల్లలు మరియు బీపీఎల్ కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పాఠశాలలో చేరాలని ఆయన కోరారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ప్రత్యేక అవకాశాన్ని తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు.పాఠశాలలో ప్రవేశాల కోసం ఆసక్తి గల వారు 8500023457, 9705108585 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.స్థలం: అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్, పాత కేంద్రీయ విద్యాలయ భవనం, ఆదిలాబాద్.



## పూర్వ విద్యార్థులకు ఆర్టీఎఫ్ చెక్కుల పంపిణీ

- **ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు అవగాహన**
- **ఆమనగల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి**

**ఆమనగల్ మే 14(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈరోజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆమనగల్‌లో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీపాద శర్వాని పూర్వ విద్యార్థులకు ఆర్టిఎఫ్ చెక్కులను అందజేశారు. అనంతరం ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి కళాశాలలో ప్రవేశాలు పొందాల్సిందిగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





## పార్టీ ద్రోహులకు పదవులా..... డీసీసీ సెక్రటరీ ఎల్మ వినయ్ రెడ్డి

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 14(ప్రజాక్షేత్రం):-**

గతం లో ఎమ్మెల్యే ఎన్నికలు కాని ఎంపీ ఎన్నికలు మొన్న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో కుడా పార్టీ కి వ్యతిరేకంగా పని చేసిన ద్రోహులకు పదవులు కట్టబెట్టడం పై కార్యకర్తల ఆగ్రహం...

ఒక్కరోజు కూడా పార్టీ కార్యక్రమం లో పాల్గొనకుండా పైరవీలు చేసుకొని పదవులు పొందడం ఏంటని కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు ప్రశ్నిస్తున్నారు.... జిల్లా అధ్యక్షులు అసలు పార్టీ ద్రోహులకు పదవులు ఎలా కట్టబెట్టారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.బోథ్ కన్వీనర్ గా నియమించబడిన వ్యక్తి మొన్న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి పని చేసి కన్న తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీ కి ద్రోహం చేసిన వ్యక్తి అలాంటి వ్యక్తిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలనీ ధన్నూర్ గ్రామ కాంగ్రెస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు సంతకాలు సేకరణ చేసి మరి సదరు వ్యక్తి ని పార్టీ నుండి సస్పెండ్ చేయాలనీ జిల్లా అధ్యక్షులు కి చెప్పిన వినకుండా ఇవ్వాలా ఏకంగా పార్టీ ద్రోహి కే కన్వినర్ పదవి కట్టబెట్టడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వెంటనే జిల్లా అధ్యక్షులు పార్టీ ద్రోహులని పదవి నుండి తొలగించి నిజమైన కార్యకర్తకి పదవి కట్టబెట్టాలని లేని యెడల ఈ విషయం గురించి పీసీసీ అధ్యక్షులు గారిని జిల్లా ఇంచార్జి మంత్రి ని కలిసి వివరిస్తామని ఆఖరికి గాంధీ భవన్ ఎదుట బైటయించడానికి అయిన సిద్ధం అని అవసరమైతే మూకుమ్మడి రాజీనామాలకు సైతం సిద్ధమని హెచ్చరించారు.

## సర్కారు బడిలో చదువు... సమాజ ప్రగతికి తొలి అడుగు

- **పెద్దేముల్ మండల కేంద్రంలో బడీబాట ర్యాలీ**
- **తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి**
- **ప్రభుత్వ పాఠశాల విద్యతో విద్యార్థులకు బంగారు భవిష్యత్**
- **ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల ప్రతిభకు పునాది**
- **విద్యతోనే సమాజంలో సమగ్ర అభివృద్ధి**
- **విద్యార్థుల సమగ్ర వికాసానికి చర్యలు చేపడుతున్నాం - జిహెచ్ఎం శ్రీమతి సునీత**
- **- బడిబాట కార్యక్రమంలో పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు,ఉపసర్పంచ్ డివై ప్రసాద్**

**పెద్దేముల్, మే 14(ప్రజాక్షేత్రం):**

ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు అన్నారు.గురువారం పెద్దేముల్ గ్రామంలో "బడిబాట" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ప్రజలను కోరారు.అనంతరం పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని,పాఠశాలల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. ఉపసర్పంచ్ డివై ప్రసాద్ మాట్లాడుతూ ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా కార్యాచరణ రూపొందించాలని అన్నారు.బడి బయట ఉన్న పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సునీత మాట్లాడుతూ..... ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతుల అభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జిహెచ్ఎం అక్కమాదేవి,పెద్దేముల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి అన్నపూర్ణ, విద్యా కమిటీ చైర్‌పర్సన్లు గౌసియా, శ్రీమతి ప్రమీల, గ్రామ పంచాయతీ కార్యదర్శి లాలప్ప, పంచాయతీ కారోబార్ నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# సాయి పల్లవికి షాకిచ్చిన ‘రామాయణ’ టీమ్!



నితేష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం ‘రామాయణ’. ఈ సినిమాలో సీతగా నటిస్తున్న సాయి పల్లవి గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆమె పోషిస్తున్న పాత్రకు మేకర్స్ డబ్బింగ్ ఆర్టిస్ట్‌ను వినియోగించాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటీవల సాయి పల్లవి హిందీలో నటించిన ఫస్ట్ సినిమా ‘ఏక్ దిన్’. ఇందులో జునైద్ ఖాన్ సరసన నటించగా.. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ఈ సినిమాలో సాయి పల్లవి హిందీ డైలాగ్ డెలివరీ, ఆమె స్లాంగ్ పై నెటిజన్ల నుంచి కొంత విమర్శలు వచ్చాయి.పౌరాణిక చిత్రమైన ‘రామాయణ’లో భాష చాలా స్వచ్ఛంగా, స్పష్టంగా ఉండాలి. కాబట్టి సాయి పల్లవి హిందీ యాస సీత పాత్రలోని దైవత్వానికి లేదా గాంభీర్యానికి సరిపోకపోవచ్చని కొందరు అభిప్రాయ పడుతున్నారట. సాయి పల్లవి తన పాత్రలకు తానే డబ్బింగ్ చెప్పుకోవడానికి ఇష్టపడుతుంది. అయితే, సినిమా నాణ్యత, పాత్ర స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని మేకర్స్ తీసుకున్న ఈ నిర్ణయం సాయి పల్లవి షాక్ అనే చెప్పాలి. అందుకు సాయి పల్లవి కూడా ఒప్పుకున్నట్లు టాక్. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ భారీ చిత్రం మొదటి భాగం 2026 దీపావళి కానుకగా విడుదల కానుంది. రణబీర్ కపూర్ రాముడు, సాయి పల్లవి సీత, యష్ రావణుడు, సన్నీ డియోల్ హనుమంతుడు వంటి పాత్రలో కనిపించబోతున్నారు.

# దర్శకుడుగా హీరో రామ్..



తెలుగు సినీ పరిశ్రమలో ‘ఎనర్జిటిక్ స్టార్’గా తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్న హీరో రామ్ పోతినేని (RAPO). ‘దేవదాసు’ హీరోగా మొదలైన రామ్ ప్రయాణం.. తనదైన నటనతో, చలాకీతనంతో, అదిరిపోయే డాన్సులతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకునేలా చేసింది. అయితే, ఇన్నాళ్లూ తన నటనతో కెమెరా ముందు మ్యాజిక్ చేసిన రామ్.. ఇప్పుడు తన కెరీర్‌లో ఓ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆయన ఇకపై కేవలం హీరో మాత్రమే కాదు.. దర్శకుడు కూడా! రామ్ హీరోగా నటిస్తున్న 23వ చిత్రం (#RAPO23)కి సంబంధించి అభిమానులకు ఒక పవర్‌ఫుల్ అప్‌డేట్ సిద్ధమైంది. ఈ సినిమాతో ఆయన దర్శకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. కెమెరా ముందు యాక్షన్ చేస్తూనే, కెమెరా వెనుక ‘యాక్షన్’ చెప్పబోతున్నారు. రామ్ సినీ ప్రయాణంలో ఇదొక పవర్‌ఫుల్ టర్న్ అని చెప్పాలి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రకటన రేపు (మే 15వ తేదీ) ఉదయం 10:08 గంటలకు అట్టహాసంగా వెలువడనుంది. రామ్ స్వయంగా తానొక దర్శకుడిగా మారాను అనే విషయాన్ని రేపు అధికారికంగా ప్రకటించనున్నారు.

రామ్ ఉన్నట్టుండి మెగాఫోన్ పట్టుకున్నారు? అయితే వెనుక ఒక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. వాస్తవానికి రామ్ గతంలో తన కోసం తానే ఓ పవర్‌ఫుల్ స్టోరీని రాసుకున్నారు. కథ అయితే సిద్ధమైంది కానీ, దాన్ని తాను ఊహించిన విధంగా, ఆ కథలోని ఎమోషన్‌ను పర్ఫెక్ట్‌గా స్క్రీన్‌పై ప్రెజెంట్ చేయగల దర్శకుడి కోసం ఆయన చాలా కాలం పాటు వేట సాగించారు. పలువురు దర్శకులను సంప్రదించినప్పటికీ, తన కథను తాను అనుకున్న స్థాయిలో డీల్ చేయగల దర్శకుడు ఆయనకు దొరకలేదట. తన కథలోని ఆత్మను పూర్తిగా అర్థం చేసుకున్న వ్యక్తి తానే కావడంతో, చివరకు ఆ బాధ్యతను తన భుజాలపైనే వేసుకోవాలని రామ్ గట్టి నిర్ణయించుకున్నారు.

# మిషన్ మంగళ్ దర్శకుడితో?




‘కర’ సినిమాతో ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించారు తమిళ హీరో ధనుష్. దర్శకుడిగా, నటుడిగా భిన్నమైన కథలతో ప్రయాణిస్తున్న ఈయన ఖాతాలో ప్రస్తుతం రాజ్ కుమార్ పెరియసామి తెరకెక్కిస్తున్న ఓ చిత్రం ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ధనుష్ జాబితాలో మరో చిత్రం చేరినట్లు తెలుస్తోంది. ‘మిషన్ మంగళ్’ చిత్రంతో మంచి హిట్‌ను అందుకున్న బాలీవుడ్ దర్శకుడు జగన్ శక్తితో ఆయన ఓ సినిమా కోసం చేతులు కలిపినట్లు సమాచారం. ప్రస్తుతం జగన్ శక్తి.. అజయ్ దేవగన్ నటిస్తున్న ‘రేంజర్’ సినిమాతో బిజీగా ఉన్నారని, ఆ ప్రాజెక్ట్ పూర్తయ్యాక దీనికి సంబంధించిన స్క్రిప్ట్ పనుల్ని మొదలు పెట్టనున్నారని ధనుష్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి ఇందులో నిజమెంత ఉందో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# ఇష్టపడకపోతే.. మరింత కష్టపడతా!



నాతో మంచి స్నేహం కుదరాలంటే కనీసం నాలుగుసార్లు అయినా కలిసి మాట్లాడాలి అంటోంది బాలీవుడ్ హీరోయిన్ సారా అలీఖాన్. అంతేకాదు కెరీర్‌లో నెగిటివిటీని పట్టించుకోకుండా.. ప్రేక్షకులు ఆదరించే వరకు కష్టపడతానని చెప్పుకొచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సారా మాట్లాడుతూ.. ‘‘మీరు నన్ను రెండు, మూడు సార్లు కలిసినప్పుడు నేను మీకు నచ్చకపోవచ్చు. కానీ, మనం నాలుగోసారి కలిస్తే కచ్చితంగా స్నేహితులవుతాం. నా జీవితంలోనే ఒక ఫిల్టర్ సిస్టమ్ ఉన్నట్లుంది. అందుకేనేమో నేను మీకు నచ్చాలంటే నాలుగుసార్లు అయినా కలవాలి. నా కెరీర్ ప్రారంభంలోనే ప్రేక్షకుల నుంచి చాలా ప్రేమ లభించింది. ‘కేదార్‌నాథ్’, ‘సింబా’ విడుదల తర్వాత రాత్రికి రాత్రే ఫేమ్ సాధించడంతో తొలినాళ్లలోనే అమ్మ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. నేను కూడా నిజాయతీతో పనిచేస్తే ప్రేక్షకులు ప్రేమతో ఆదరిస్తారని అప్పుడే తెలుసుకున్నా. అంతా మంచే జరగాలని ఆశిస్తూ ముందుకు సాగిపోవాలనుకున్నా. నెగిటివిటీని అస్సలు పట్టించుకోను. నా దృష్టిలో ఎలాంటి నెగిటివిటీ ఎదురైనా చివరికి పనే మాట్లాడుతుందని భావిస్తాను. ఒకవేళ ప్రేక్షకులు నన్ను ఇష్టపడకపోతే మరింత కష్టపడతాన’’ని అంది. ‘పతి పత్నీ ఔర్ వోదో’ చిత్రంతో ఈ నెల 15 నుంచి థియేటర్లలో సందడి చేయనుంది సారా.

# ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు..



టాలీవుడ్ యంగ్ అండ్ సెన్సేషనల్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే ప్రస్తుతం వరుస అవకాశాలతో ఇండస్ట్రీలో క్రేజీ బ్యూటీగా మారింది. ‘మిస్టర్ బచ్చన్’ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ భామ, ఆ సినిమా ఫలితంతో సంబంధం లేకుండా తన గ్లామర్, నటనతో దర్శకనిర్మాతలను మెస్మరైజ్ చేస్తోంది. విజయ్ దేవరకొండ, రామ్ పోతినేని, దుల్కర్ సల్మాన్ వంటి స్టార్ హీరోలతో నటించిన సరైన హిట్ అందుకోలేకపోయింది. అయినప్పటికీ వరుస అవకాశాలు దక్కించుకుంటోంది.ప్రస్తుతం స్టార్ హీరో శివకార్తికేయన్ సరసన ‘సెయాన్’ చిత్రంతో తమిళ ఇండస్ట్రీలోకి కూడా అడుగుపెడుతోంది. అలాగే అక్కినేని అఖిల్ సరసన ‘లెనిన్’ చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం వేగంగా జరుగుతోంది. దీనిని జూన్ 26న విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న భాగ్యశ్రీ తాను పని చేసిన ప్రతి హీరో నుంచి ఏదో ఒక విషయాన్ని నేర్చుకున్నానని తెలిపింది. “మాస్ మహారాజా నుంచి సహనం, షూటింగ్ సెట్స్‌లో ఆయన చూపించే అంతులేని ఎనర్జీని చూసి ఆశ్చర్యపోయా. ఇక విజయ్ దేవరకొండకు సినిమాపై ఉన్న ప్యాషన్, ప్రతి సీన్‌ను పర్ఫెక్ట్‌గా చేయాలనే ఆయన తపన నను ఎంతగానో ప్రభావితం చేశాయి. రామ్ కేవలం స్టార్ హీరో మాత్రమే కాదు, అద్భుతమైన డ్యాన్సర్. ప్రతి షాట్ కోసం ఆయన పెట్టే డెడికేషన్ నుంచి చాలా విషయాలు గ్రహించాను. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. ఇక దుల్కర్ సల్మాన్ ఇప్పటికే సీనియర్ నటుడైనప్పటికీ, ప్రతి సన్నివేశాన్ని ఒక కొత్త నటుడిలా ఆసక్తిగా గమనించడం ఆయన గొప్పతనం” అని ప్రశంసలు కురిపించింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## శర్వానంద్‌శ్రీనువైట్ల సినిమాలో
# హీరోయిన్‌గా క్రేజీ బ్యూటీ!

టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు. ఇటీవల ‘బైకర్’ చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన ఆయన, ఇప్పుడు ‘భోగి’ అనే యాక్షన్ డ్రామాతో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలోనే శర్వానంద్ తన తదుపరి ప్రాజెక్టును టాలీవుడ్ సీనియర్ దర్శకుడు శ్రీనువైట్లతో ఖరారు చేయడం విశేషం. శ్రీనువైట్ల మార్క్ కామెడీకి, విభిన్నమైన టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌ను జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్లు తెలుస్తోంది. వినోదానికి సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ తోడైతే ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలుగుతుందని చిత్రబృందం భావిస్తోంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జులై 2026 నుంచి షూటింగ్ ప్రారంభించి, వచ్చే సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో శర్వానంద్ సరసన నటించే హీరోయిన్ విషయంలో గత కొన్ని రోజులుగా ఆసక్తికర చర్చ జరుగుతోంది. మొదట పూజా హెగ్డే, మమిత బైజు వంటి స్టార్ హీరోయిన్ల పేర్లు వినిపించినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం.. మిస్ ఇండియా రన్నరప్ మానస వారణాసిని ఖరారు చేసినట్లు టాలీవుడ్ టాక్. ఇటీవల ‘కపుల్ ఫ్రెండ్లీ’ సినిమాతో తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్న మానస, ఇప్పుడు శర్వానంద్ లాంటి స్టార్ పక్కన నటించే అవకాశం దక్కించుకుంది. శర్వానంద్‌మానస జోడీ వెండితెరపై ఒక ఫ్రెష్ ఫీల్‌ను ఇస్తుందని సినీ వర్గాలు అభిప్రా



యపడుతున్నాయి. శ్రీనువైట్ల తనదైన శైలిలో కామెడీని పండిస్తూనే, సైన్స్ ఫిక్షన్ లాంటి కొత్త జోనర్‌ను టచ్ చేస్తుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ తుది దశలో ఉందని సమాచారం.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394